## నేటి కందం-నేటికి అందం

**టన్నెలు రెస్క్యూ టీములు,**
**టన్నుల ఔషధ చయములు ,డాక్టరుతతులున్**
**తిన్నగ నేపాలున కా**
**పన్నుల సత్వరము గావ పంపంబడియెన్ !!**

(మోడీ గారి ఆదేశంతో టన్నుల కొద్దీ మందులు, డాక్టర్ల సమూహాలు, టన్నెల్ రెస్క్యూ టీములు నేపాలుకు మానవతా దృక్పథంతో పంపబడినాయి. ఇది మన విశాల దృక్పథాన్ని ప్రపంచానికి తెలియజేసింది.) **-రాధశ్రీ**
సెల్:9494481210



# నేటినిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: **బైస దేవదాస్** సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

**రిపేర్ షెడ్డు నుండి**
**రోడ్డు పైకి కారు**
**ఉనికిని చాటుకుంటూ**
**ఉరుకుతుంది జోరు.**
**అభివృద్ధి పథకాల**
**అమలుతోని బ్రేకులు**
**ప్రభుత్వం వేయకుంటే**
**పరిపాలన షేకులు**

**చురక**

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 4-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:28 పేజీలు:6 వెల: రూ.1/-


## కొండా సురేఖను బర్తరఫ్ చేస్తూ..
# కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం



హైదరాబాద్, సెప్టెంబర్ 3: తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపిన కొండా సురేఖ ఎపిసోడ్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొండా సురేఖ రాజీనామా చేస్తారా?.. బర్తరఫ్ చేస్తారా? అంటూ కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. సురేఖను బర్తరఫ్ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆమోద ముద్ర లభించగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ సిఫారసు లేఖను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు పంపించారు. రాజీనామాకు కొండా సురేఖ అంగీకరించకపోవడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

మరోవైపు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమించింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిని నియమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇక.. కొండా సురేఖ, చిన్నారెడ్డి విషయంలో ఏఐసీసీ తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ క్యాడర్ హర్షం వ్యక్తం చేస్తోంది. పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచే వాళ్ల పట్ల కఠినంగానే ఉండాలని కాంగ్రెస్ కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీపై గౌరవం లేనివాళ్లు పార్టీ నుంచి వెళ్లిపోవాలని కాంగ్రెస్ క్యాడర్ చెబుతోంది.

### కొండా సురేఖ బర్తరఫ్‌కు ప్రధాన కారణం ఇదే.!

కొండా సురేఖ బర్తరఫ్‌కు పార్టీ నాయకత్వంతో ఏర్పడిన విభేదాలు, ఆమె వ్యవహారశైలిపై తలెత్తిన అసంతృప్తే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రభుత్వ, పార్టీ వ్యవహారాల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు, తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారడం కూడా ఇందులో ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా పార్టీ క్రమశిక్షణకు భిన్నంగా వ్యవహరించారనే అభిప్రాయం నాయకత్వంలో వ్యక్తమైనట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆమెపై అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకుంది.

## చదువుతో జీవితంలో ఉన్నత శిఖరాలు : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నల్గొండ, సెప్టెంబర్ 3:చదువును ఆయుధంగా చేసుకుంటే పేదరికాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూచించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యం, భద్రత, మెరుగైన వసతులు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యాబోధన, వసతులు, విద్యార్థుల సంక్షేమం, వంటశాల, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

**విద్యార్థులతో ముఖాముఖి**

విద్యార్థుల చదువు, భోజనం, వసతులు ఎలా ఉన్నాయని కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అందుతున్న భోజనం, మెనూ అమలు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు అందుతున్న సౌకర్యాలపై కలెక్టర్ వివరించారు.

**క్రమశిక్షణతోనే లక్ష్యసాధన**

చదువుతో పాటు క్రమశిక్షణ, బాధ్యత, వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు నిరంతరం మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలన్నారు.

**ధ్రువీకరణ పత్రాలు తెచ్చినవారి పేర్లను నమోదు చేయాలి**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సమగ్ర ఓటర్ ప్రక్రియ ను ఆయన పరించారు.

ఎన్యుమరేషన్‌లో మ్యాపింగ్ కాని ఓటర్లతో పాటు వివరాలు తప్పుగా ఉన్న ఓటర్లకు సక్రమంగా నోటీసులు అందుతున్నాయా.. లేదా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ రాజశేఖర్ రెడ్డి. ఆర్ ఐ రంజిత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, ప్రధాన ఉపాధ్యాయులు మల్లారెడ్డి, జీపీఓ చంద్రకళ, బీఎల్‌ఓలు, గద్దల శైలేజ, మామిడి వసంత పాల్గొన్నారు.

## నేడు తెల్లవారు జామున నింగిలోకి
# ఈవోఎస్-05 ఉపగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 3: ఇస్రో సుమారు ఎనిమిది నెలల తరువాత అంతరిక్ష ప్రయోగానికి సిద్ధమైంది. GSLV-F17 రాకెట్ ద్వారా EOS-05 ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. ఇందుకు శుక్రవారం 4వ తేదీ తెల్లవారు జామున 2:55 నిమిషాలకు ముహూర్తం పెట్టారు. దీన్ని శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ సెంటర్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉపగ్రహాన్ని GISAT-1A కూడా పిలుస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహంగా ఈ ఉపగ్రహం నిలువనుంది. అత్యంత అధునాతన టెక్నాలజీతో దీన్ని రూపొందించారు.

GSLV-F17 శాటిలైట్ ఇతర భూ పరిశీలన ఉపగ్రహాలన్నింటి కంటే ప్రభావంతం పనిచేస్తుంది. వాతావరణ, పర్యావరణ, తుఫానులు, వరదలు, వ్యవసాయం, అడవులు వంటి భౌగోళిక మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు. GSLV-F17 జీఎస్‌ఎల్‌వీ ప్రయోగాల్లో 19వది. ఈ రాకెట్ చేపట్టిన 18 ప్రయోగాల్లో 6 విఫలమయ్యాయి. ప్రారంభంలో ఈ రాకెట్ ప్రవర్తన వల్ల దీనికి నాటీ బాయ్ అనే పేరు పెట్టారు ఇస్రో సైంటిస్టులు.

## భారత్‌లో ఏఐ వ్యవస్థ చూస్తే సంతోషం కలుగుతోంది: ఎన్విడియా సీఈఓ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ఏఐ రంగంలో ముందువరుసలో నిలిచేందుకు భారత్ త్వరపడాలని, వేగం పెంచాలని మైక్రోప్రాసెసర్‌ల తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ సూచించారు. బలమైన ఐటీ రంగం ఉన్న భారత్‌కు స్థానికంగా ఏఐ ఆర్థికవ్యవస్థ రూపొందించుకునే అవకాశం ఉందని అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ రంగంలో తమకంటూ స్థానాన్ని పదిల పరుచుకునేందుకు దేశాలు త్వరపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఏఐ ఒక కొత్త సాంకేతిక వేదికగా రూపుదిద్దుకుంటోందని చెప్పారు.

ఐటీ రంగంలో భారత్ ఇప్పటికే ముందువరుసలో ఉందని అన్నారు. అయితే, ఏఐ ఓ కొత్త సాంకేతిక వేదిక అని చెప్పారు. ఏఐ రంగాన్ని అందింపుచుకుంటున్న భారతీయ సంస్థలను చూస్తుంటే సంతోషంగా ఉందని కూడా అన్నారు. అయితే, ఏఐ రంగంలో ముందువరుసలో ఉండాలంటే మాత్రం స్పీడు పెంచకతప్పదని స్పష్టం చేశారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ మెడల్ ఆఫ్ ఆనర్‌ను ఇటీవల జెన్సన్ హువాంగ్ స్వీకరించారు. జీపీయూ రంగం అభివృద్ధిలో పాత్రకు గాను ఆయనను ఈ అవార్డు వరించింది. ఈ సందర్భంగా అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి ఏఐ జమానాలోనూ ఇంజినీరింగ్‌యే ఉన్నతమైన కోర్సు అని వ్యాఖ్యానించారు. ఏఐ రాకతో టెక్నికల్ వర్క్ తీరుతెన్నులు మారిపోతున్నప్పటికీ తన దృష్టిలో ఇంజినీరింగ్ ఇప్పటికీ ముఖ్యమేనని చెప్పారు.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు



ములుగు, సెప్టెంబర్ 3:(నేటినిజం ప్రతినిధి): ఈవీఎం గోదాంలో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.

గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్‌ను పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతా స్థితిని కలెక్టర్ పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా చెప్పుకునే అవకాశం ఇస్తారు: కొండా సురేఖ..

హైదరాబాద్, సెప్టెంబర్ 3: దేవాదాయ శాఖ మంత్రిగా తనను బర్తరఫ్ చేయడంపై కొండా సురేఖ స్పందించారు. తనను అన్యాయంగా పదవి నుంచి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శిక్షించారని అన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత పటేల్ వ్యాఖ్యలకు తనను శిక్షించడం ఏంటని.. ఆమె అభిప్రాయంతో తనకేం సంబంధమని కాంగ్రెస్ పెద్దలను సురేఖ సూటిగా ప్రశ్నించారు. రాజీనామా చేయమంటే చేసేదాన్నని, తన వివరణ అడిగి చర్యలు తీసుకుంటే బాగుండేదన్నారు. నిజంగా తాను తప్పు చేసి ఉంటే బర్తరఫ్ చేసినా పర్వాలేదని కొండా సురేఖ చెప్పుకొచ్చారు.



ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. 'మంత్రి పదవి నాకు ఆభరణం మాత్రమే. కారణం చెప్పకుండా తొలగించడం బాధాకరం. గతంలో మంత్రి పదవికి స్వయంగా నేనే రాజీనామా చేశా. ప్రస్తుతం మంత్రులు సంతోషంగా లేరు. ఈ విషయం గుండెపై చేయి వేసుకొని వారు చెప్పాలి. మంత్రులంతా బయటకు వచ్చి మాట్లాడాలి. పనులు కావాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కాదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని కోరుతున్నాను. నేను పార్టీని, ప్రభుత్వాన్ని ఏం అనలేదు. మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని తిట్టినవారే. ఇందిరాగాంధీని జైపాల్ రెడ్డి తిట్టారు. రోశయ్య సైతం ఇందిరాగాంధీని తిట్టారు. సీఎం రేవంత్‌పై ఆరోపణలు చేసిన వారికీ పదవులు ఇచ్చి సన్మానం చేశారు.

ఎవరి అండ లేకుండా మేం పైకి వచ్చాం. నా భర్తను కారులో ఎక్కించుకొని వరంగల్ అంతా తిప్పారు. మా కాళ్లు మొక్కి మాతో ప్రచారం చేయించుకున్న వాళ్లూ మమ్మల్ని తిడుతున్నారు. మా నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్సీకి వాళ్ల భార్య కూడా ఓటేయదు. నన్ను తొలగించాలనే ఆలోచన ఏఐసీసీకి లేదు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి నన్ను బర్తరఫ్ చేశారు. వేం, పొంగులేటి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి ఏకమై నన్ను ఇబ్బంది పెట్టారు. డబ్బులు వసూలు చేసిన వాడే నా మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు పెట్టాడు. సుమంత్ పేరు చెప్పి కిరణ్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. తమ ప్రభుత్వంలో తమ మనుషులను ఇబ్బంది పెట్టుకోవడం చరిత్రలో ఎక్కడా లేదు. సుమంత్‌ని ఇబ్బంది పెట్టడం ఆపేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. కాంగ్రెస్ సర్కార్ సరిదిద్దుకోవాల్సిన, మార్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి.

ప్రభుత్వం మళ్లీ రావాలంటే చాలా మార్పులు జరగాలి. మోనోపాలీ లాగా వెళ్లడం సరైంది కాదు. తనకు తానే ముఖ్యమంత్రి అని చెప్పుకోవడం సరికాదు. నిర్ణయాలు తీసుకునేప్పుడు చర్చించాలి. ఎమ్మెల్యేగా ఉంటాను.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తాను. నాకు పార్టీలో ఇబ్బంది అవుతుందని అనుకుంటున్నా. నా కూతురు నేను ఖండిస్తే ఆమెను కించపరిచినట్టు అవుతుంది. మంత్రిగా తొలగించడం అవమానమని అనుకోవడం లేదు. నేను తప్పు చేస్తే ఇబ్బంది పడేదాన్ని. తప్పు చేయకుండా బర్తరఫ్ చేయడం పార్టీ తప్పు. రేవంత్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తేడా ఉంది' అని అన్నారు.

## కొండా సురేఖ విషయంలో హైకమాండ్ నిర్ణయమే ఫైనల్: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

*హైదరాబాద్, సెప్టెంబర్ 03: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అంశంలో పార్టీ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఆమె విషయంలో పార్టీ హైకమాండ్ వద్ద పూర్తి సమాచారం ఉందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణలో ఎవరికీ చోటు ఉంటుందనేది పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని తెలిపారు. హైకమాండ్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని పార్టీ నేతలతోపాటు శ్రేణులకు ఆయన సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పోరాటం చేసిన కార్యకర్తలకు న్యాయం జరగాలని ఈ సందర్భంగా పార్టీ అధిష్ఠానానికి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.*

కొండా సురేఖ జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లాలోని గీసుకొండలో ఆమె జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఆమె కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అవి వైరల్ అయ్యాయి. కొండ సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై పార్టీలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు పార్టీ నోటీసులు జారీ చేసింది.

పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. దీంతో క్రమశిక్షణ కమిటీకి కొండా సురేఖ లేఖల ద్వారా వివరణ ఇచ్చారు. అయితే కొండా సురేఖపై పార్టీ అధిష్ఠానం ఆగ్రహంతో ఉందని.. తీవ్ర నిర్ణయం తీసుకుంటుందనే చర్చ నడుస్తోంది. మరో వైపు సీఎం రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరిస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ కేబినెట్‌లోకి కొత్త వారిని తీసుకుంటారనే చర్చ కూడా నడుస్తుంది. దీంతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై విధంగా స్పందించారు.

## ప్రముఖ స్త్రీవాద ఉద్యమకారిణి, రచయిత్రి గ్లోరియా స్టీనెమ్ మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:అమెరికాలో ఫెమినిస్ట్‌గా పేరుగాంచిన ప్రముఖ రచయిత్రి గ్లోరియా స్టీనెమ్ 92 ఏండ్ల వయసులో న్యూయార్క్‌లోని తన నివాసంలో బుధవారం మరణించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో తన ఫాలోవర్లు, అభిమానులు వెల్లడించారు. ఈమె స్త్రీ స్వేచ్ఛ కోసం, లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపారు. దీనికోసం ఉమెన్స్ యాక్షన్ అలయన్స్ అనే సంస్థను స్థాపించారు. గ్లోరియా 1972లో మిస్ మ్యాగజీన్ ను సహ వ్యవస్థాపకురాలిగా ప్రారంభించారు. ఈ మ్యాగజీన్ అమెరికాలో మొదటి ఫెమినిస్ట్ పత్రికగా నిలిచింది. ఇది మహిళల యాజమాన్యంలో, మహిళల కోసం నడిచిన తొలి పత్రిక.

మహిళల హక్కులు, సమానత్వం, భావప్రకటన స్వేచ్ఛ కోసం ఆమె జీవితాంతం పోరాడారు. మహిళల పునరుత్పత్తి హక్కులపై పోరాడినవారిలో గ్లోరియా ప్రముఖంగా నిలిచారు. గర్భస్రావం రాజ్యాంగబద్ధ హక్కు అని 1973లో రో వర్సెస్ వేడ్ కసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆమె స్వాగతించారు. మహిళల కోసం చేసిన కృషికి ఆమె 2013లో అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను బరాక్ ఒబామా చేతుల మీదుగా అందుకున్నారు.

# ఓం నమో భగవతే వాసుదేవాయ

## (04 సెప్టెంబర్ "శ్రీ కృష్ణ జన్మాష్టమి" శుభ పర్వదినం సందర్భంగా)

హిందూ పురాణ గ్రంథాల ప్రకారం, మాత దేవకి, వాసుదేవుడు దంపతులకు మధుర నగరంలో అష్టమి తిథి భాద్రపద మాస కృష్ణ పక్షం 8వ రోజు వృషభ లగ్నం రోహిణి నక్షత్ర శుభ సమయాన అర్ధరాత్రి జన్మించాడు శ్రీ కృష్ణ పరమాత్ముడు. రాక్షస ప్రవృత్తి కలిగిన కంసుడు కారాగారంలో బంధించిన వేళ ఆ దంపతులకు పుట్టిన చిన్ని కృష్ణున్ని బృందావనంలో యశోద నందుల ఇంటికి చేర్చిన విషయం మనకు తెలుసు. శ్రీ విష్ణువు దశావతారాల్లో 8వ అవతారంగా జగన్నాథుడు జన్మించిన శుభ గడియలను కృష్ణాష్టమి, జన్మాష్టమి, గోకులాష్టమి, శతమానం, శ్రీ కృష్ణ జయంతి, శ్రీ జన్మాష్టమి, లేదా అష్టమి రోహిణి అనబడే పలు పేర్లతో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రపంచ హిందూ సమాజం నిర్వహించుకునే ఒక ముఖ్యమైన పండుగగా దీనికి ప్రాధాన్యం ఉన్నది. నిజానికి కృష్ణాష్టమి తిథి 04 సెప్టెంబర్ 2026 శుక్రవారం తెల్లవారు జామున 2:25 గంటలకు ప్రారంభమై 05 సెప్టెంబర్ 2026 శనివారం అర్ధరాత్రి 12:13 గంటలకు ముగుస్తుంది. దీనిని గమనించిన పంచాంగకర్తలు 04 సెప్టెంబరు 2026 రోజున శ్రీ కృష్ణ జన్మాష్టమి జరుపుకోవాలని నిర్ణయించారు.

### ప్రత్యేక పూజలు, అభిషేకాలు:

విష్ణుమూర్తి ఎనిమిదవ అవతారమైన వేణుమాధవుడి జననం సందర్భంగా గోకులాష్టమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకుంటారు. ఈ పవిత్ర పర్వదినం రోజున బాల గోపాలుడికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేస్తారు. బాల కృష్ణుడి రూపమైన లడ్డూ గోపాలుడికి స్నానం చేయించి, నూతన వస్త్రాలు ధరింపజేసి, పంచామృతాలు, వెన్న, తులసి దళాలు సమర్పిస్తారు. కృష్ణాష్టమి రోజు కృష్ణున్ని పూజిస్తే అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సొంతం అవుతాయని నమ్ముతారు. ఈ రోజున దేవాలయాలు లేదా గృహాల్లో చిన్ని కృష్ణుని విగ్రహాన్ని ఉయ్యాలో అమర్చి జోలపాటలు పాడుతూ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ పర్వదినం రోజున ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఇస్కాన్ రాధా గోవింద మందిరాల్లో భక్తులంతా "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే" నామాన్ని జపిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు చేయడం కొనసాగుతున్నది. గోపాలుడి ఫోటోకు పుష్పాలతో పూజలు చేస్తూ "శ్రీ కృష్ణ పరబ్రహ్మణే నమః" అనే మంత్రాన్ని 21 లేదా 54 లేదా 108 సార్లు మనసారా జపిస్తారు. పూజలో భాగంగా నల్లనయ్యకు నైవేద్యంగా అటుకుల ప్రసాదాన్ని సమర్పిస్తారు. దేశవ్యాప్తంగా అనేక కృష్ణ మందిరాలు ఉన్నప్పటికీ మహారాష్ట్రంలో విఠోబా, రాజస్థాన్‌లో శ్రీనాథ్ జీ, ఉడిపిలో కృష్ణుడు, కేరళలో గురువాయురప్ప, యూపీలో బృందావనం, తమిళనాడులా పార్థసారథి, గుజరాత్‌లో ద్వారక, ఒడిసాలో పూరీ క్షేత్రాలు ప్రత్యేక కన్నయ్య మందిరాలుగా పేరుగాంచాయి.

హైందవ ధర్మానికి సంబంధించిన జన్మాష్టమి పండుగను గొప్ప ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పర్వదినంలో భాగంగా ప్రత్యేక భజనలు, నృత్యాలు, కీర్తనలు ఆలపించడం ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. శ్రీ కృష్ణుడి జీవితం, గీతోపదేశం మన జీవన ప్రయాణంలో సన్మార్గాలను బోధిస్తున్నది. కృష్ణుడి జీవితం జ్ఞానం, శాంతి, పరహిత భావనలు, ప్రేమ, భక్తి, కరుణ, సత్య మార్గం లాంటి గుణాలను బోధిస్తున్నది. పుర వీధుల్లో ఉట్లు కొట్టే పోటీలు కూడా నిర్వహిస్తారు. బాల కృష్ణుడిని పూజించడం ద్వారా కష్టనష్టాలు, దుఃఖం, దోషం, దారిద్ర్యం తొలగిపోతాయని నమ్ముతారు.

"ఓం నమో భగవతే వాసుదేవాయ"
– "శ్రీ కృష్ణార్పణమస్తు" !



-మధుపాళీ
9949700037

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

**అటవీ ఉత్పత్తులతో స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెంపొందించాలి**

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**




ములుగు, సెప్టెంబంర్ 3:(నేటినిజం ప్రతినిధి): మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుప రచుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు.

గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలో ట్రెజరీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన దుస్తుల తయారీ, జూట్ బ్యాగుల తయారీ యూనిట్లను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకుల అనుసంధానంతో వడ్డీ లేని రుణాలు అందిస్తూ స్వయం ఉపాధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. మహిళలు కుట్టు నైపుణ్యాలను నేర్చుకొని సొంతంగా యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆదాయం పొందడంతోపాటు మరికొందరికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రూ.10 లక్షలతో ఆధునిక యంత్రాలను సమకూర్చినట్లు తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన, ఆదివాసీ మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలకు ఉపయోగపడే వస్తువులను తయారు చేయడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు.

ములుగు నియోజకవర్గంలో ప్రైవేటు సంస్థల సహకారంతో సుమారు 2,000 మందికి శిక్షణ అందించినట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు మహిళా సంఘాలు, గ్రామీణాభివృద్ధి శాఖ, ఐటీడీఏ ద్వారా కుట్టు యంత్రాలు అందించే అంశంపై కృషి చేస్తున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గానికి 1,000 కుట్టు యంత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. కుట్టు శిక్షణ పూర్తిచేసిన వారి జాబితాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజన మహిళలకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా కుట్టు యంత్రాలు అందించేందుకు ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు.

శిక్షణ పూర్తయిన తర్వాత మహిళలు తమ ఇళ్ల వద్దనే కుట్టు యంత్రాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులతోపాటు అంగన్‌వాడీ పిల్లల ఏకరూప దుస్తుల కుట్టు పనులను మహిళలకు అందించ ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. ఏకరూప దుస్తుల కుట్టు చార్జీలను పెంచాలన్న అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఇటువంటి శిక్షణ, తయారీ కేంద్రాలను మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అటవీ ప్రాంతాల్లో లభించే ఇప్పపువ్వు, తేనె, విస్తరాకుల తయారీకి ఉపయోగపడే ఆకులతో ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పపువ్వుతో లడ్డూల తయారీ వంటి కార్యక్రమాలు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. గోనెపల్లిలో తేనె ఉత్పత్తికి సంబంధించిన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక వనరులతో సొంత గ్రామాల్లోనే వ్యాపారాలు నిర్వహించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భోజనాలకు విస్తరాకులను వినియోగించాలని మంత్రి సూచించారు. మేడారం జాతర సందర్భంగా మంత్రులు, సిబ్బంది, పోలీసులతోపాటు వేలాది మందికి భోజనాలు అందించేందుకు కామారం నుంచి సేకరించిన ఆకులను ఉపయోగించినట్లు గుర్తుచేశారు. ఆకులు లభించే చెట్లను, తేనె ఉత్పత్తికి దోహదపడే అటవీ వనరులను సంరక్షించుకోవాలని సూచించారు.

జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఎటువంటి అటవీ ఉత్పత్తులు లభిస్తున్నాయి, వాటితో ఎలాంటి వస్తువులు తయారు చేయవచ్చనే అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఇద్దరు లేదా ముగ్గురు యువతకు అధ్యయన బాధ్యతలు అప్పగించి, స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి అవకాశాలను గుర్తించాలని సూచించారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు.

అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి మంత్రి అనసూయ సీతక్క పదిమంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను, ఏటూరు నాగారం మండల పరిధిలోని 1,219 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో తొలిసారిగా ఎంపిక చేసిన 11 ఉత్తమ పాఠశాలలకు సంబంధించిన అవార్డులను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇన్‌చార్జి ఏపీఓ ప్రతాప్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ జనార్ధన్, ఆత్మ కమిటీ చైర్పర్సన్ రఘు , డివిజన్ చైర్పర్సన్ రవీందర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జలభద్రతపై డిపార్ట్‌మెంటల్ సదస్సు ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రధాని

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో సాయంత్రం 4:30 సమయంలో జలశక్తి మంత్రిత్వశాఖ నిర్వహి ంచనున్న డిపార్ట్‌మెంటల్ సదస్సు ముగింపు సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశా న్నుద్దేశించి ఆయన ప్రసంగించారు.

బృంద స్ఫూర్తిని బలోపేతం చేయడం, సహకార సమాఖ్య వాదాన్ని విస్తరించడం, కేంద్రం – రాష్ట్రాల మధ్య సన్నిహిత సహకారం ద్వారా దేశ ప్రాధాన్యాల విషయంలో సమష్టి నేతృత్వాన్ని పెంపొందించే దిశగా... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా నిర్వహి ంచతలపెట్టిన వరుస సదస్సుల్లో ఇది మొదటి కార్యక్రమం. ఈ రెండు రోజుల సదస్సును సెప్టెంబరు 1, 2 తేదీల్లో నిర్వహిస్తున్నారు. రంగాలవారీగా కీలకమైన ప్రాధాన్య అంశాలు, వాటి అమలును వేగవంతం చేయడం తోపాటు ఫలితాలపై కలిసి చర్చించడానికి.. ఒక క్రమబద్ధమైన వేదికను ఇది అందిస్తోంది.

అత్యుత్తమ ఆచరణ పద్ధతులను పరస్పరం పంచుకోవడంతోపాటు ప్రాధాన్య అంశాలు, అమలులో సవాళ్లకు పరిష్కారాలు,

నిర్దిష్ట వ్యవధులతో కూడిన కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలపై చర్చించేలా.. రాజకీయ నాయకత్వాన్నీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులనూ ఈ సదస్సు ఒకే వేదికపైకి తేనుంది. జాతీయ లక్ష్యాల సాధనలో సమష్టి బాధ్యతను ప్రోత్సహించడంతోపాటు.. పరిపాలన పరంగానూ, సేవల్లోనూ ఈ చర్చలను స్పష్టమైన ఫలితాలుగా మలచే ముఖ్య లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు.

# ఆయుర్వేద దినోత్సవానికి ముందు 'ఆయుర్‌వార్తా' డిజిటల్ చర్చా పరంపరను ప్రారంభించిన ఏఐఐఏ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ఆయుష్ మంత్రిత్వశాఖలో ఓ భాగంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న స్వయంప్రతిపత్తి సంస్థ అఖిల భారతీయ ఆయుర్వేద సంస్థ'(ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద.. ఏఐఐఏ). ఈ సంస్థ 'ఆయుర్‌వార్తా' శింఎబీతీఎజీతీబిజీరి ను ప్రారంభించింది. ఇది డిజిటల్ మాధ్యమంలో వరుసగా సాగుతూ ఉండే ఓ విశిష్ట చర్చా కార్యక్రమం. ఆయుర్వేదానికి సంబంధించిన ప్రామాణిక జ్ఞానం, విజ్ఞానశాస్త్ర దృష్టికోణాలు, సమకాలీన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఆయుర్వేదానికి ఉన్న సందర్భశుద్ధి.. వీటిని దేశ విదేశాల్లో జనబాహుళ్యం చెంతకు చేర్చడం 'ఆయుర్‌వార్తా' కార్యక్రమ లక్ష్యం.

ఈ నెల 23న ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. అంతకు ముందే, పైన ప్రస్తావించిన 'ఆయుర్‌వార్తా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఆయుర్‌వార్తా' చర్చా పరంపరలో ఆయుర్వేద, ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లు, విజ్ఞానశాస్త్ర సంబంధ పరిశోధనలు, విద్య, చికిత్స పద్ధతులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేదకు ప్రాసంగికత అంతకంతకు విస్తరిస్తుండడంతో ముడిపడిన అంశాలపై నిపుణులతో మాటామంతీని నిర్వహించనున్నారు.

ఏఐఐఏకు చెందిన డైరెక్టరు ప్రొఫెసర్ (వైద్య) పి.కె. ప్రజాపతితో పాటు డీన్, ప్రొఫెసర్ (డాక్టర్) మహేశ్ వ్యాస్ మధ్య జరిగిన చర్చ కార్యక్రమంతో 'ఆయుర్‌వార్తా' తొలి ఎపిసోడ్‌ను రూపొందించారు. వీరు ఇద్దరూ "ఆయుర్వేద దినోత్సవాన్ని సెప్టెంబరు 23నే ఎందుకు నిర్వహించాలి?" అనే విషయంపై చర్చలో పాల్గొన్నారు.

చర్చలో.. 'ఆయుర్వేద దినోత్సవ' పరిణామ క్రమ ప్రస్తావన ఉంది. దీనిని ఇంతకు ముందు ధన్వంతరి జయంతి (ధన్‌తేరస్'గా పాటిస్తూ రావడం, ప్రతి ఏటా ఒక నిర్దిష్ట తేదీన ఆయుర్వేద దినోత్సవాన్ని జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గురించిన వివరాలు కూడా చర్చలో ప్రస్తావనకు వచ్చాయి.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆయుర్వేదాన్ని ఒక ముఖ్య జ్ఞానంగా, ఆరోగ్యసంరక్షణ వ్యవస్థగా బలోపేతం చేయడానికి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రపంచమంతటా ఆరోగ్య రంగంలో ఆయుర్వేదానికి సందర్భశుద్ధి రోజు రోజుకూ పెంపొందుతోందని ఏఐఐఏ డైరెక్టరు ప్రొఫెసర్ (వైద్య) పి.కె. ప్రజాపతి అన్నారు.

ఒక నిర్దిష్టమైన రోజున ఆయుర్వేద దినోత్సవాన్ని పాటించడం వల్ల దీని వార్షిక నిర్వహణకు మరింత ఎక్కువ నిరంతరత్వం లభించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో దీనికి ఒక బలమైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు.

ఈ దృష్టికోణాన్నిడిజిటల్ మాధ్యమంలోకి విస్తరించే ప్రయత్నమే 'ఆయుర్‌వార్తా'. దీని ద్వారా ఆయుర్వేద తాలూకు ప్రామాణిక జ్ఞానాన్ని, నిపుణుల దృష్టికోణాలను ప్రజలకు వివరిస్తారని కూడా ప్రొఫెసర్ ప్రజాపతి తెలిపారు.

చర్చలో ప్రొఫెసర్ (డాక్టర్) మహేశ్ వ్యాస్ సెప్టెంబరు 23కున్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. ఆ రోజున ప్రకృతిలో శరత్కాల విషువత్తు సంభవిస్తుందని, ఆ రోజున సూర్య కిరణాలు భూమధ్య రేఖపై నిటారుగా పడటం వల్ల ప్రపంచమంతటా పగలు, రాత్రి దాదాపు సమానంగా ఉంటాయని ఆయన గుర్తుచేశారు.

ఆయుర్వేదం పరంగా మనుషుల ఆరోగ్యాన్ని, శ్రేయస్సును అర్థం చేసుకోవడంలో సంతులనం, సామంజస్యం అనేవి కీలక అంశాలు అవుతాయని ప్రొఫెసర్ (డాక్టర్) మహేశ్ వ్యాస్ వివరించారు. ఈ కారణంగా ఆయుర్వేదంలో సంతులనం, సామంజస్యం, సమత్వంపై ఆధారపడిన దృక్పథంతో కూడా సెప్టెంబరు 23ను జోడించవచ్చని ఆయన అన్నారు.

ఆయుర్వేదకు చెందిన వివిధ పార్శ్వాలపై నిరంతర ప్రాతిపదికన , సాధికారిక చర్చకు ఉద్దేశించిన డిజిటల్ వేదికగా 'ఆయుర్‌వార్తా'ను రూపొందిస్తారు. ఈ చర్చా పరంపరలో భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ఆయుర్వేద నిపుణులు, వైద్యులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన నిపుణులు పాల్గొననున్నారు.

# పరిశుభ్రత, సామర్థ్యానికి కట్టుబాటును పునరుద్ఘాటిస్తూ ప్రత్యేక ప్రచారం 6.0 కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ సన్నాహక సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 6.0 కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్ కస్సీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), దాని అనుబంధ సంస్థలు, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ), కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ)లకు చెందిన నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 6.0 గురించి సమావేశంలో సంపూర్ణ అవగాహన కల్పించారు. ప్రచారం ప్రధాన లక్ష్యాలు, ప్రాధాన్య అంశాలు, అమలు వ్యూహాన్ని వివరిస్తూ విస్తృత ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 5.0 సందర్భంగా బొగ్గు మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలు, అమలు చేసిన ఉత్తమ విధానాలను కూడా అధికారులకు వివరించారు. ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 6.0లో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలు, నిర్దేశించిన ప్రాధాన్యతలపై నోడల్ అధికారులకు అవగాహన కల్పించారు.

ఈ-వ్యర్థాలను సమర్థవంతంగా సేకరించడం, వేరు చేయడం, సక్రమంగా పారవేయడం, కార్యాలయ ప్రాంగణాలను మెరుగుపరచడం, ఆధునిక పారిశుద్ధ్య విధానాలను అవలంబించడం, స్క్రాప్‌ను సమర్థవంతంగా పారవేయడం, కార్యాలయ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడం, డిజిటలీకరణ, పర్యావరణహిత విధానాలను ప్రోత్సహించడం, వ్యర్థాలను సంపదగా మార్చడం, సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడం, పౌరుల అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చే విధానాలను అవలంబించడం; సంస్థాగత ప్రోటోకాల్స్, వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడం మొదలైన అంశాలపై ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 6.0లో ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 5.0పై పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్పీజీ) విడుదల చేసిన మదింపు నివేదిక ప్రకారం, అందుబాటులోకి వచ్చిన కార్యాలయ స్థల విస్తీర్ణం పరంగా బొగ్గు మంత్రిత్వ శాఖ మొదటి స్థానాన్ని, ఆదాయం సమకూర్చిన విషయంలో మూడో స్థానాన్ని సాధించింది. ప్రత్యేక పారిశుద్ధ్య ప్రచారం 5.0ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా పరిశుభ్రత, పర్యావరణ సుస్థిరత, వనరుల సమర్థ నిర్వహణ పట్ల బొగ్గు మంత్రిత్వ శాఖ తన నిరంతర నిబద్ధతను చాటుకుంది.

గత ప్రచారంలో సాధించిన విజయాలు ప్రత్యేక పరిశుభ్రతా ప్రచారం 6.0ను మరింత విజయవంతంగా, ప్రభావవంతంగా అమలు చేసేందుకు బలమైన పునాదిని అందిస్తున్నాయి.

ప్రచార కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతోపాటు పరిశుభ్రత, కార్యాలయాల సామర్థ్యం, సకాలంలో పెండింగ్ అంశాల పరిష్కారం, సమగ్ర పరిపాలనా సామర్థ్యంపై స్పష్టమైన, సానుకూల ప్రభావాన్ని తీసుకురావాలన్న బొగ్గు మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఈ సన్నాహక సమావేశం పునరుద్ఘాటించింది. కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, మరింత సమర్థవంతమైన, సువ్యవస్థిత కార్యాలయ వాతావరణాన్ని సృష్టించడంపై నిరంతరం దృష్టి సారిస్తూ, బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తోంది.

# సహకార సంఘం చైర్మన్ ముత్యాల శ్రీనివాస్‌కు సన్మానం

**మున్నూరు కాపు బిడ్డకు కీలక బాధ్యత దక్కడం గర్వకారణం**

**రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి: సంఘం నాయకులు**



ఆదిలాబాద్, సెప్టెంబంర్ 3: నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన ముత్యాల శ్రీనివాస్‌ను దండెపల్లి మండలం మెదరిపేట మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ముత్తినేని మల్లేష్ మాట్లాడుతూ ముత్యాల శ్రీనివాస్ సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నిక కావడం మున్నూరు కాపు సమాజానికి గర్వకారణమ న్నారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసి సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు యువత రాజకీయ, సామాజిక, సహకార రంగాల్లో ముందుకు వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి చైర్మన్ ముత్యాల శ్రీనివాస్ కృషి చేయాలని నాయకులు కోరారు. తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మెదరిపేట మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రతినిధులు, యువకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# అహ్మదాబాద్ నుంచి హబ్ అండ్ స్పోక్ అంతర్జాతీయ విమాన సేవలను ప్రారంభించిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: వారణాసి, అమృత్‌సర్ తర్వాత అంతర్జాతీయ ప్రయాణికుల రవాణా కోసం భారతదేశ హబ్ అండ్ స్పోక్ విధానంతో అనుసంధానించిన మూడో విమానాశ్రయంగా అహ్మదాబాద్‌ను చేరుస్తూ... పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ రోజు అహ్మదాబాద్ నుంచి హబ్ అండ్ స్పోక్ (ఒక ప్రధాన విమానాశ్రయం కేంద్రంగా ఉండి, దానికి అనేక విమానాశ్రయాలు అనుసంధాన కేంద్రాలుగా పని చేసే విమాన సేవల విధానం) అంతర్జాతీయ విమాన సేవలను ప్రారంభించింది.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు, గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మోహోల్, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘవి పాల్గొన్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.

2026 జూన్ 25న వారణాసి నుంచి ప్రారంభమైన హబ్ అండ్ స్పోక్ సేవలు భారతీయ విమానయాన రంగంలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాయి. ఈ ప్రాజెక్ట్ దశలవారీ విస్తరణలో భాగంగా, 2026 జూలై 28న అమృత్‌సర్ విమానాశ్రయం నుంచి కూడా ఈ సేవలను ప్రారంభించారు. అహ్మదాబాద్‌ను కూడా ఈ నెట్‌వర్క్‌లో చేర్చడం ద్వారా, ఢిల్లీలోని మన సొంత హబ్ విమానాశ్రయం ద్వారా భారతదేశంలోని వివిధ ప్రాంతాలను ప్రపంచంతో నేరుగా అనుసంధానించే, సమగ్ర, నిరంతర, ప్రయాణికుల కేంద్రిత విమానయాన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే దిశగా ఈరోజు మరో కీలక ముందడుగు పడింది. ఇప్పుడు అహ్మదాబాద్ నుంచి ప్రారంభమైన హబ్-అండ్-స్పోక్ కార్యకలాపాలు ప్రపంచ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఇందులో 'ఏఐ1117' విమాన సర్వీసు ప్రయాణికులను ప్రధానంగా యూరప్, ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్య ప్రాంతాలలోని 22 గమ్యస్థానాలకు అనుసంధానిస్తుంది. రాత్రి 20:15 గంటలకు బయలుదేరే సాయంత్రపు సర్వీసు "ఏఐ 1121' ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా, యూరప్‌లోని 17 గమ్యస్థానాలకు అనుసంధానతను విస్తరిస్తుంది.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు అహ్మదాబాద్ ప్రయాణికులకు రాబోయే మార్పులను వివరించారు. ఇప్పటి వరకు అహ్మదాబాద్ నుంచి పారిస్, టొరంటో లేదా సిడ్నీ వంటి గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు ముందుగా ఢిల్లీకి దేశీయ విమానంలో వెళ్లాల్సి వచ్చేదని, ఇందుకోసం వేర్వేరుగా టికెట్లు బుక్ చేసుకోవడం, ఢిల్లీ చేరుకున్న తర్వాత లగేజీని స్వయంగా తీసుకోవడం, పెద్ద విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ క్యూలను ఎదుర్కోవడం, అలాగే కనెక్టింగ్ విమానం తప్పిపోయే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు. అయితే హబ్ అండ్ స్పోక్ విధానం కింద ఇమ్మిగ్రేషన్, చెక్-ఇన్ లగేజ్ చెక్-త్రూ ప్రక్రియలన్నీ ఇకపై అహ్మదాబాద్‌లోనే పూర్తవుతాయని, దీనివల్ల లగేజ్ నేరుగా ప్రయాణికుల చివరి అంతర్జాతీయ గమ్యస్థానానికే చేరుకుంటుందని వివరించారు.

2030 నాటికి భారతీయ ప్రయాణికులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన విమానయాన కేంద్రంగా, 2047 నాటికి ప్రపంచంలోనే ప్రముఖ విమానయాన కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఇంటర్నేషనల్ ఏవియేషన్ హబ్ స్ట్రాటజీ'లో ఈ హబ్ అండ్ స్పోక్ నమూనా కీలకమైన భాగం. విదేశీ ట్రాన్సిట్ విమానాశ్రయాలపై ఆధారపడటాన్ని తగ్గించి, భారతీయ హబ్‌ల ద్వారా అనుసంధానతను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం భారతదేశ వ్యూహాత్మక భౌగోళిక ప్రాంతాన్ని, విస్తృత విమానాశ్రయ మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటుంది.

తొలిసారి చేపట్టిన ఈ నూతన విధానం కింద, అంతర్జాతీయ ప్రయాణికులు ప్రపంచంలోని తమ గమ్యస్థానాలకు ప్రయాణాన్ని ప్రారంభించే ముందే, స్వయంగా అంతర్జాతీయ విమానాశ్రయమైన తమ ప్రారంభ స్పోక్ విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ నిబంధనలను పూర్తి చేసుకుంటారు. నిర్దేశిత హబ్ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ లేదా కస్టమ్స్ ప్రక్రియలను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేకుండా నేరుగా తమ తదుపరి అంతర్జాతీయ విమానంలోకి వెళ్ళవచ్చు. లగేజీ కూడా నేరుగా బదిలీ కావడం వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యం ఏర్పడి ప్రయాణంలో ఎదురయ్యే సంక్లిష్టతలు తగ్గుతాయి.

ఈ విధానం సామర్థ్యం గురించి కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, గత ఏడాది అహ్మదాబాద్ నుంచి అంతర్జాతీయ విమానాలు ఎక్కేందుకు 1.6 కోట్ల మంది ప్రయాణికులు ఢిల్లీకి ప్రయాణించారని తెలిపారు. ఈ హబ్ అండ్ స్పోక్ విధానం ద్వారా లభించే నిరాటంకమైన ప్రయాణ సౌకర్యంతో 2030లో జరిగే కామన్వెల్త్ క్రీడల కోసం అనేక గమ్యస్థానాల నుంచి వచ్చే అంతర్జాతీయ సందర్శకులకు ఆతిథ్యమివ్వడానికి అహ్మదాబాద్ సిద్ధంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఈ విధానం వల్ల ప్రయాణికుల రాకపోకలు పెరిగి దాని ప్రయోజనాలు అహ్మదాబాద్‌లోని జౌళి, ఔషధాలు,, వజ్రాలు, రత్నాలు, ఇంజనీరింగ్ రంగాలకు చేకూరతాయని కేంద్ర మంత్రి తెలిపారు.

ఈ హబ్ అండ్ స్పోక్ నమూనా ద్వారా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి అంతర్జాతీయ అనుసంధానత పెరుగుతుంది. ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ అనుభూతి లభిస్తుంది. విమానాశ్రయ మౌలిక సదుపాయాలు సమర్థవంతంగా వినియోగమవుతాయి. విమానయాన సంస్థల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది. భారతీయ విమానయాన రంగానికి ప్రపంచ స్థాయి పోటీతత్వం చేకూరుతుంది.

ఈ ప్రయోజనాలు కేవలం విమానయాన రంగానికే పరిమితం కావు. అంతర్జాతీయ మార్కెట్లు, గమ్యస్థానాలకు రవాణా సౌలభ్యం మెరుగుపడటం వల్ల ఈ మెరుగైన అంతర్జాతీయ అనుసంధానత గుజరాత్‌లోని వ్యాపార వర్గాలు, వజ్రాల ఎగుమతిదారులతో సహా ఇతర ఎగుమతిదారులు, హస్తకళాకారులు, పెట్టుబడిదారులు, పర్యాటకులు, విద్యార్థులకు కూడా విశేషంగా లబ్ధి చేకూరుస్తుంది. జాతీయ హబ్ నెట్‌వర్క్‌తో అహ్మదాబాద్ బలమైన అనుసంధానం వ్యాపారం, పర్యాటకం, పెట్టుబడులు, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. తద్వారా ప్రపంచస్థాయి అనుసంధానత కలిగిన రాష్ట్రంగా గుజరాత్ ఎదుగుదలకు ఇది సహకరిస్తుంది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం, విమానయాన హబ్‌ల అభివృద్ధి ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల (0.4 మిలియన్) ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రావడమే గాకుండా భారత జీడీపీకి అదనంగా 30 బిలియన్ అమెరికన్ డాలర్లు సమకూరే అవకాశం ఉంది. 2047 నాటికి, దీని మొత్తం ప్రభావం ద్వారా దాదాపు 1.6 కోట్ల (16 మిలియన్ల) ప్రత్యక్ష , పరోక్ష ఉద్యోగాలకు మద్దతు లభించడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 1.4 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల సహకారం అందే అవకాశం ఉంది.

అహ్మదాబాద్ నుంచి హబ్ అండ్ స్పోక్ విమాన సర్వీసుల ప్రారంభం, క్రమంగా విస్తరిస్తున్న ఈ వ్యవస్థను రాబోయే నెలల్లో దేశంలోని మరిన్ని విమానాశ్రయాలకు విస్తరించడాన్ని సూచిస్తుంది. గుజరాత్‌లోని సూరత్ సహా మరో 22 విమానాశ్రయాలకు హబ్ అండ్ స్పోక్ కనెక్టివిటీని తదుపరి దశలో విస్తరించనున్నట్లు శ్రీ రామ్‌మోహన్ నాయుడు తెలిపారు.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ మనోజ్ కుమార్ దాస్, డీజీసీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ రాజేష్ నిర్వాన్, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ పునీత్ కన్సల్‌తో పాటు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్, సీఐఎస్ఎఫ్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రంలో పాల్గొన్నారు. వివిధ పరిశ్రమల సంఘాల ప్రతినిధులు, హోటల్, ఆతిథ్య రంగానికి చెందిన భాగస్వాములు, ట్రావెల్ భాగస్వాములు, పర్యాటక రంగ ప్రతినిధులు, విమానయాన, వాణిజ్య రంగాలకు చెందిన ఇతర కీలక భాగస్వాములు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అహ్మదాబాద్ నుంచి అంతర్జాతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేసేందుకు వివిధ రంగాల నుంచి లభిస్తున్న బలమైన సహకారానికి ఇది నిదర్శనంగా నిలిచింది.

## రామకృష్ణాపూర్‌లో విషాదం

### కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్, సెప్టెంబంర్ 3: రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది.

భగత్‌సింగ్ నగర్‌కు చెందిన పిన్నింటి మహేందర్ (39) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేందర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లిదండ్రులతో గొడవపడి మహేందర్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 10.45 గంటల సమయంలో మహేందర్ తండ్రి బుచ్చిరాజయ్య రాత్రి విధులకు వెళ్లేందుకు కుమారుడిని పిలిచారు.

అయితే ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి వెనుక ద్వారం గుండా బయటకు వచ్చి చూశారు.

## రాజకీయ ఉనికి కోసమే మంత్రిపై సుమన్ అసత్య ఆరోపణలు

### బాల్క వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు



ఆదిలాబాద్, సెప్టెంబంర్ 3:చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మంత్రి వివేక్ వెంకటస్వామిపై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ? నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సాగుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బాల్క సుమన్ అక్కసు వెళ్లగక్కుతున్నారని కాంగ్రెస్ నేతల ఆగ్రహం వ్యక్తం చేశారు.

సుమన్ భవిష్యత్తులో చెన్నూరులో మళ్లీ గెలిచే అవకాశం లేదన్న నిరాశ, రాజకీయ ఉనికి కోసమే మంత్రిపై అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మే ప్రసక్తి లేదని వారు పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో గోదావరి తీరంలో విచ్చలవిడిగా ఇసుక మాఫియా, కమిషన్ల దందా నడిపించి రూ.కోట్లు కొల్లగొట్టింది బాల్క సుమన్ కాదా అని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ప్రశ్నించారు ప్రశ్నించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మరోసారి మాట్లాడితే రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, నిరాధారమైన ఆరోపణలు వెంటనే వెనక్కి తీసుకుని చెన్నూరు ప్రజలకు బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## బీసీసీఎల్ కీలక ప్రాజెక్టులు, కార్యకలాపాలపై ప్రధాన మంత్రి సలహాదారు శ్రీ తరుణ్ కపూర్ సమీక్ష



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) ప్రధాన కేంద్రం కోయ్‌లా భవన్‌లో ఓ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి ప్రధానమంత్రి సలహాదారు శ్రీ తరుణ్ కపూర్ అధ్యక్షత వహించారు. శ్రీ తరుణ్ కపూర్ నిన్న, ఇవాళ ధన్‌బాద్‌తో పాటు ఆ ప్రాంతంలోని కీలక ప్రదేశాల్లో అధికారిక పర్యటనకు వచ్చిన సందర్భంగా తొలి రోజున సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో బీసీసీఎల్ ప్రధాన కార్యకలాపాలు, కీలక ప్రాజెక్టులు, సాంకేతిక కార్యక్రమాలు, భద్రత చర్యలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. శ్రీ కపూర్ పర్యటనలో ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గం ఆయన వెంట ఉంది. శ్రీ కపూర్ మునిడీహ్‌లో బీసీసీఎల్ కీలక ప్రాజెక్టులతో పాటు కుసుండా ప్రాంతంలోని ఈఎన్ఏ ఫైర్ ప్రాజెక్టును కూడా పరిశీలించారు. అధిక ముప్పు గల ప్రాంతాల కుటుంబాలతో ఆయన మాట్లాడారు.

సమీక్ష సమావేశంలో పాలు పంచుకున్న వారిలో కోల్ ఇండియా చైర్మన్ శ్రీ బి. సాయి రామ్, బీసీసీఎల్ సీఎండీ శ్రీ మనోజ్ కుమార్ అగర్వాల్, జౌళి మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి అలకనంద దయాళ్, బొగ్గు మంత్రిత్వశాఖ ప్రాజెక్టు సలహాదారు శ్రీ ఆలోక్ కుమార్ సింగ్, మానవ వనరుల డైరెక్టరు శ్రీ మురళీ కృష్ణ రామయ్య, సాంకేతిక కార్యకలాపాల డైరెక్టరు శ్రీ సంజయ్ కుమార్ సింగ్, ఆర్థిక విషయాల డైరెక్టరు శ్రీ రాజేశ్ కుమార్, సాంకేతిక, ప్రాజెక్టులు, ప్రణాళిక విషయాల డైరెక్టరు శ్రీ రాజీవ్ కుమార్ సిన్హాలతో పాటు రైల్వేలకు చెందిన సీనియర్ అధికారులు, ఏరియా జనరల్ మేనేజర్లు, ప్రధాన కకేంద్రం జనరల్ మేనేజర్లు, విభాగాల అధిపతులు, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.

సమీక్ష సమావేశంలో బీసీసీఎల్ సీఎండీ శ్రీ మనోజ్ కుమార్ అగర్వాల్ సంస్థ ప్రధాన నిర్వహణ కార్యకలాపాలు, కీలక విజయాలు, సవాళ్లు, భావి కార్యా చరణ ప్రణాళికలను ప్రస్తావిం చారు. సాంకేతిక కార్యకలాపాల డైరెక్టరు శ్రీ సంజయ్ కుమార్ సింగ్ బీసీసీఎల్ కార్యకలాపాల తీరు, వ్యూహాత్మక కార్యక్రమాలు, రాబోయే కాలంలో చేపట్టే పథకాలను గురించి సమగ్రంగా వివరించారు.

### ఉత్పత్తి, సాంకేతికత, భావి అభివృద్ధి ప్రణాళికల సమీక్ష

బీసీసీఎల్ కీలక కార్యకలాపాలను వివరించే సూచికలు, బొగ్గు ఉత్పత్తి, వస్తు వినియోగం, బొగ్గు నిక్షేపాలు, నిర్వహణ సామర్థ్యం, ప్రధాన బలాలు, సవాళ్లతో పాటు 2030-31 వరకు నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను ప్రజెంటేషన్లో పేర్కొన్నారు.

గత అయిదు సంవత్సరాల్లో భూమి లోపలి (యూజీ) గనులు, సమీప ఉపరితల (ఓపెన్ కాస్ట్.. ఓసీ) గనుల పనితీరుతో పాటు, బొగ్గును వెలికితీసేందుకు ఖనిజ పొరల్లో మట్టిని, ఇసుకను, రాళ్ళ తదితర వ్యర్థ పదార్థాలను తొలగించే ప్రక్రియ (ఓవర్ బర్డెన్ రిమూవల్.. ఓబీఆర్)ను కూడా సమీక్షించారు.

అలాగే, సంస్థ ఉత్పత్తి సామర్థ్యం, రాబోయే అయిదు సంవత్సరాల్లో సంస్థ అమలు చేయనున్న ప్రణాళికలపై చర్చించారు.

భూగర్భంలో పెద్ద ఎత్తున బొగ్గును అత్యంత వేగంగా, సురక్షితంగా వెలికితీసేందుకు బీసీసీఎల్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆధునిక లాంగ్ వాల్ , హైవాల్ మైనింగ్ విధానాలను ఈ సమావేశంలో సమీక్షించారు. సర్ఫేస్ మైనర్స్, కంటిన్యువస్ మైనర్స్ వంటి అధునాతన సాంకేతికతల ఉపయోగాన్ని విస్తరించే దిశగా సిద్ధం చేసిన ప్రణాళికలపైన కూడా చర్చించారు.

ఝరియా బొగ్గు గనిలో ఓసీ బ్లాకుల పునర్వ్యవస్థీకరణ, ఎండీఓ, రెవెన్యూ పంపకం నమూనాల ద్వారా కార్యకలాపాలను ఆపేసిన గనులను తిరిగి అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన ప్రణాళికలను గురించి సమావేశంలో ప్రస్తావించారు. బొగ్గును యంత్రాల సాయంతో కడిగి, శుద్ధమైన బొగ్గుగా మార్చే కేంద్రాల (వాషరీస్) పనితీరు, వాషింగ్ సామర్థ్య విస్తరణ ప్రణాళికలతో పాటు బొగ్గు నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించారు.

దేశ కోకింగ్ కోల్ అవసరాలను తీర్చడంలో బీసీసీఎల్‌ది వ్యూహాత్మక పాత్ర అని శ్రీ కపూర్ స్పష్టంచేశారు. నిరంతరాయ అభివృద్ధి ప్రక్రియలు, లాభదాయకతకు మద్దతిచ్చేందుకు సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలని, అందుబాటులో ఉన్న వనరులను విజ్ఞానశాస్త్ర పరంగా, అత్యంత అనుకూల స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

నిర్వహణ, పరిపాలన సంబంధిత కీలక సవాళ్లను, వాటి మూల కారణాలను, ఆ సవాళ్లను పరిష్కరించడానికి అనుసరిస్తున్న మార్గాలను తెలుసుకోవడానికి బీసీసీఎల్ ఏరియా జనరల్ మేనేజర్లతో కూడా శ్రీ కపూర్ సమావేశమయ్యారు.

సమీక్ష సమావేశం పూర్తి అయిన తరువాత, శ్రీ తరుణ్ కపూర్ కోల్ బెడ్ మీథేన్ (సీబీఎమ్) బ్లాకు-ఎ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా, సీబీఎం గ్యాస్ వెలికితీతకు అవలంబిస్తున్న సాంకేతికత, ప్రాజెక్టు పురోగమిస్తున్న వైనం, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన ప్రణాళికలను గురించి సంబంధిత వర్గాలు ఆయనకు తెలియజేశాయి.

శ్రీ కపూర్ మునిడీహ్ సీఎమ్ లాంగ్‌వాల్ ప్రాజెక్టును పరిశీలించారు.

భూగర్భంలో యంత్రాల సాయంతో చేపడుతున్న గని తవ్వకం కార్యకలాపాలు, సురక్షితమైన, మన్నిక కలిగిన పద్ధతులను పాటిస్తూ మంచి నాణ్యత గల కోకింగ్ కోల్‌ను నిలకడగా, విశ్వసనీయ ప్రాతిపదికన సరఫరా చేయడంలో ఈ ప్రాజెక్టు పోషిస్తున్న పాత్రను అర్థం చేసుకోవడం ఈ పర్యటనలో ముఖ్యోద్దేశం.

### ఈఎన్ఏ ఫైర్ ప్రాజెక్టు పరిశీలన.. ఎక్కువ ముప్పు గల ప్రాంతాల కుటుంబాలతో మాటామంతీ

కుసుండా ప్రాంతంలోని ఈఎన్ఏ ఫైర్ ప్రాజెక్టును శ్రీ కపూర్ పరిశీలించారు. అగ్నిప్రమాద నివారణ చర్యలు, భద్రత ఏర్పాట్లు, తత్సంబంధిత కార్యకలాపాలను సమీక్షించారు. శాస్త్రీయ పద్ధతుల్లో అగ్ని ప్రమాదాలు తలెత్తడానికి ఉన్న అవకాశాలను గుర్తించడం, థర్మల్, కృత్రిమ ఉపగ్రహ ఆధారిత పర్యవేక్షణ, వెలికితీత, ప్రభావిత ప్రాంతాల దశ వారీ పునరాశ్రయ కల్పన ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి.

కుసుండా ప్రాంతంలో పర్యటించిన శ్రీ కపూర్.. అధిక ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల కుటుంబాలతో మాట్లాడారు. వారి భద్రతకు, పునరావాసానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

## రక్షణ దళాల్లో తొలి (వైద్యేతర) మహిళా టూ-స్టార్ అధికారిగా చరిత్ర సృష్టించిన ఏవీఎం శక్తి శర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:భారత వైమానిక దళ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టం నమోదైంది. ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ భారత రక్షణ దళాల్లో ఎయిర్ వైస్ మార్షల్ (తత్సమాన) హోదాను పొందిన తొలి మహిళా అధికారిణి (వైద్యేతర విభాగం) అయ్యారు. 01 సెప్టెంబర్ 2026న, ఆమె ఎయిర్ హెడ్ క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (ఎడ్యుకేషన్)గా బాధ్యతలు స్వీకరించారు.

1994 జూన్ 18న ఐఏఎఫ్ విద్యా విభాగానికి నియమితులైన ఏవీఎం శక్తి శర్మ... శిక్షణ సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ హెడ్ క్వార్టర్స్, ఎయిర్ హెడ్ క్వార్టర్స్ వంటి విభిన్న బాధ్యతల్లో పనిచేసిన అపార అనుభవంతో ఈ నూతన బాధ్యతలు చేపట్టనున్నారు. తన కెరీర్ మొత్తంలో విద్యా, వ్యూహాత్మక రక్షణ సహకారాన్ని పెంపొందించడానికి ఐఐటీ కాన్పూర్, పూణే విశ్వవిద్యాలయంలో ఐఏఎఫ్ చైర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపన సహా, కీలకమైన సంస్థాగత కార్యక్రమాలకూ ఆమె నాయకత్వం వహించారు. కపుర్తలాలోని సైనిక్ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ, త్రివిధ దళాల నుంచి ఒక సైనిక్ పాఠశాలను కమాండ్ చేసిన తొలి మహిళా అధికారిగానూ ఆమె చరిత్ర సృష్టించారు.ఈ చరిత్రాత్మక విజయం భారత రక్షణ దళాల మహిళా అధికారుల ప్రస్థానంలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించిన ఆమె... "అత్యున్నత శక్తి, సామర్థ్యాలు, అచంచల సంకల్పంతో భారత గగనతలాన్ని రక్షించాలనే కర్తవ్యం"తో తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నారు.

## భూ విజ్ఞాన శాస్త్రాలు, ప్రజాసేవల్లో 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా...

### మై గవ్ సహకారంతో జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్‌ను ప్రారంభించిన మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:శాస్త్రీయ ఉన్నతి, ఆవిష్కరణలు, దేశసేవల్లో భూ విజ్ఞాన శాస్త్ర రంగం రెండు దశాబ్దాలను పూర్తిచేసుకున్న సందర్భంగా, 'మైగవ్' భాగస్వామ్యంతో.. 'ఎంవోఈఎస్ వ్యవస్థాపక దినోత్సవ క్విజ్: భూ విజ్ఞాన శాస్త్రాల్లో పురోగతి, దేశ సాధికారత' పోటీని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ అధికారికంగా ప్రారంభించింది. 'వికసిత్ భారత్ 2047' జాతీయ లక్ష్యానికి అనుగుణంగా - వాతావరణం, వాతావరణ అధ్యయనాలు, సముద్ర శాస్త్రం, ధ్రువ ప్రాంత అధ్యయనాలు, భూకంప శాస్త్రం సహా.. భౌగోళిక వ్యవస్థ సంబంధిత విజ్ఞాన శాస్త్రాల్లో భారత్ సాధించిన అద్భుత పురోగతిని ప్రజలకు పరిచయం చేయడమే లక్ష్యంగా మంత్రిత్వ శాఖ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ దేశవ్యాప్త ఆన్‌లైన్ పోటీని నిర్వహిస్తున్నారు.

భూ విజ్ఞాన శాస్త్ర అంశాల్లో భారత్ సాధించిన విజయాలపై పౌరులకు ఉన్న అవగాహనను అంచనా వేసేలా ఈ క్విజ్‌ను నిర్వహిస్తున్నారు. నిర్దేశిత సమయ పరిమితితో ఆసక్తికరమైన పోటీని నిర్వహిస్తున్నారు:ప్రయత్నాలు: ఒక అభ్యర్థికి ఒక ఎంట్రీకి మాత్రమే అవకాశం (నమోదిత మొబైల్ నంబర్ లేదా ఇ-మెయిల్ ఐడీ ద్వారా). అన్ని వయసుల వారు, దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు విస్తృతంగా ఈ క్విజ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించడానికి భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ కొన్ని ముఖ్య పురస్కారాలను ప్రకటించింది:నగదు బహుమతులు: 300 సెకన్ల వ్యవధిలో అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చిన వారి నుంచి.. ఎంపిక చేసిన మొదటి ముగ్గురు విజేతలకు రూ. 10,000 (పది వేల రూపాయలు) చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.

అభ్యర్థులు అధికారిక 'మైగవ్' క్విజ్ పోర్టల్‌ను సందర్శించి, నమోదు చేసుకున్న మైగవ్ లాగిన్ వివరాలు లేదా ఆధీకృత వివరాలను ఉపయోగించి లాగిన్ అయి ఈ క్విజ్‌లో పాల్గొనవచ్చు.

నిష్పాక్షికంగా ఎంపిక ప్రక్రియ ఈ క్విజ్‌ను పూర్తి పారదర్శకతతో నిర్వహించనున్నారు. అత్యధిక మార్కులు సాధించిన అర్హులైన అభ్యర్థుల జాబితా నుంచి ఒక స్వయంచాలక, సిస్టమ్ ఆధారిత యాదృచ్ఛిక ప్రక్రియ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. ప్రొఫైల్ ధ్రువీకరణ: బహుమతుల పంపిణీకి ముందు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డుల ధ్రువీకరణ తప్పనిసరి కాబట్టి, అభ్యర్థులు తమ 'మైగవ్' ప్రొఫైల్ వివరాలను నవీకరించుకోవాల్సిందిగా మంత్రిత్వశాఖ కోరుతోంది.

## 'ఎన్ఎంఎంఎస్ఎస్ 2026-27' స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు దాఖలుకు సెప్టెంబరు 30 వరకూ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబంర్ 3: 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2026-27' (ఎన్ఎంఎంఎస్ఎస్) కింద దరఖాస్తు సమర్పణ గడువును కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పొడిగించింది. ఈ పథకం కింద ఇప్పటికే ఎంపికైన విద్యార్థులు 'నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్' (ఎన్ఎస్‌పీ) ద్వారా సెప్టెంబరు 30వ తేదీవరకూ దరఖాస్తులను దాఖలు చేయవచ్చు. ఈ గడువు పొడిగింపుపై పూర్తి వివరాలు కింది విధంగా ఉన్నాయి:ఈ పథకం కింద 'ఎన్ఎస్‌పీ' పోర్టల్ ద్వారా దరఖాస్తు దాఖలుకు 2026 జూన్ 1 నుంచి విద్యార్థులను అనుమతించారు. ఈ ప్రాజెక్టు సంవత్సరం అంటే- 2026-27కుగాను ఎంపికైన విద్యార్థులు ముందుగా ఈ పోర్టల్ ద్వారా 'ఒన్ టైమ్ రిజిస్ట్రేషన్' (ఓటీఆర్) చేసుకోవాలి. ఆ తర్వాత తామెంచుకున్న స్కాలర్‌షిప్ పథకం కింద దరఖాస్తును సమర్పించాలి.

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖలోని పరిధిలోని పాఠశాల విద్య-అక్షరాస్యత విభాగం ఈ 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం' అమలవుతోంది. ప్రాథమిక స్థాయి నుంచి 8వ తరగతి తర్వాత విద్యార్థులు బడి మానేయకుండా చూడటం సహా ఉన్నత మాధ్యమిక స్థాయి అంటే- 12వ తరగతిదాకా విద్య పూర్తి చేసేలా ప్రోత్సహించడం దీని లక్ష్యం. తద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులు చదువు కొనసాగించేలా ఈ ఉపకార వేతనం దోహదం చేస్తుంది.

# "ఆవిష్కరణ, ఆత్మనిర్భరత, పౌర - సైనిక సమన్వయం ద్వారా భవిష్యత్ యుద్ధ పరిస్థితులను ఎదుర్కొనేందుకు భారత్ సంసిద్ధంగా ఉండాలి": రక్షణ శాఖ సహాయమంత్రి




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:20 26 సెప్టెంబరు 1న న్యూఢిల్లీలోని మానెక్ షా సెంటర్‌లో నిర్వహించిన సంయుక్త యుద్ధ అధ్యయన కేంద్ర (సీఈఎన్‌జేవోడబ్ల్యూఎస్) రెండో వార్షిక 'ట్రైడెంట్ ఉపన్యాస' కార్యక్రమానికి రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేత్ హాజరై.. 'దేశ నిర్మాణం కోసం తదుపరి తరం సామర్థ్యాన్ని వినియోగించుకోవడం' అన్న ఇతివృత్తంపై ప్రత్యేక ప్రసంగం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న అంతర్జాతీయ భద్రతా వాతావరణం నేపథ్యంలో త్రివిధ దళాల ఉమ్మడి కార్యాచరణ, సమన్వయం, పౌర-మిలిటరీ సహకారం, బలమైన, ఆత్మనిర్భరత కలిగిన రక్షణ వ్యవస్థ ఎంతైనా అవసరమని శ్రీ సేత్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గనిర్దేశంలో, రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నాయకత్వంలో.. భారత్ తన రక్షణ సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేసుకుంటూ ఆత్మనిర్భర, వికసిత భారత్ ఆశయాల సాధన దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. సాయుధ దళాల అంకితభావం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, త్రివిధ దళాల మధ్య మరింత మెరుగైన సమన్వయాలే.. బలమైన, భద్రమైన భారత్‌కు పునాది అని ఆయన స్పష్టం చేశారు.

భారత యువత శక్తిసామర్థ్యాన్ని శ్రీ సేత్ కొనియాడారు. భారతీయ ఎంఎస్ఎంఈలు, దేశీయ పరిశ్రమల పాత్ర రక్షణ, పరిశ్రమలు, అంకుర సంస్థలు, అంతరిక్షం, వ్యవసాయం, సాంకేతికత, క్రీడలు సహా విభిన్న రంగాలలో నేటి యువత విశేషంగా రాణిస్తోందన్నారు. 'దేశంలో తయారు చేద్దాం (మేక్ ఇన్ ఇండియా)' అన్న స్థాయిని దాటి.. 'ప్రపంచానికి అందిద్దాం (మేక్ ఫర్ ది వరల్డ్)' అనే స్థితికి దేశ ఆలోచన పరిధి విస్తరించిందని ఆయన వ్యాఖ్యానించారు. దిగుమతులపై ఆధారపడే స్థితి నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం కలిగిన ఉత్పత్తులు, సాంకేతికతలను తయారుచేస్తూ, ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదిగిన తీరును ఇది ప్రతిబింబిస్తోందన్నారు.

పెరుగుతుండడం హర్షణీయమన్న శ్రీ సేత్... భవిష్యత్తులో తలెత్తగల యుద్ధాలను ఎదుర్కొనేందుకు వీలుగా సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అత్యాధునిక సాంకేతికతల్లో దేశ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

సభనుద్దేశించి మాట్లాడుతూ.. దేశ భద్రత ఇప్పుడు ప్రాదేశిక రక్షణకే పరిమితం కాదనీ, ఆర్థిక భద్రత, సాంకేతిక పోటీతత్వం, సముద్ర తీర స్థిరత్వం, కీలక మౌలిక సదుపాయాలు, సరఫరా వ్యవస్థలు, సమాచార సమగ్రత వంటివన్నీ ఇందులో భాగమయ్యాయనీ సీఐఎస్సీ, ఎయిర్ మార్షల్ తేజిందర్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సహా ఇటీవల చేపట్టిన మిలిటరీ ఆపరేషన్లను ఉదాహరణగా పేర్కొంటూ.. సమన్వయంతో కూడిన ప్రణాళిక, సమగ్ర నిర్వహణ అత్యంత ప్రధానమైనవని ఆయన స్పష్టం చేశారు.

వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా తదితర ప్రముఖ వక్తలు కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడారు. పౌర - మిలిటరీ సమన్వయం, బహుమాధ్యమ యుద్ధ తంత్రం, అత్యాధునిక సాంకేతికతలు, త్రివిధ దళాల సమన్వయం, భవిష్యత్తు భద్రతా సవాళ్లకు భారత్ సన్నద్ధత వంటి కీలక అంశాలపై వారు విస్తృతంగా చర్చించారు. 'వికసిత భారత్ ఏ2047' ఆశయాల సాధన దిశగా భారత్ పురోగమిస్తున్న తరుణంలో.. జాతీయ భద్రతకు సంబంధించి భవిష్యత్ దృష్టి, సమగ్ర ఆలోచన, ఆవిష్కరణలతో కూడిన విధానం అత్యంత ఆవశ్యకమని ఈ చర్చలు పునరుద్ఘాటించాయి.

'యాన్ ఎరా ఇన్ ఆలివ్ గ్రీన్: జనరల్ అనిల్ చౌహాన్, డ్యూటీ, లీడర్‌షిప్ అండ్ లెగసీ' గ్రంథాన్ని కూడా ఈ కార్యక్రమం సందర్భంగా ఆవిష్కరించారు. ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ (డాక్ట్రిన్, ఆర్గనైజేషన్ అండ్ ట్రైనింగ్) డిప్యూటీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ ధన్‌కర్ ముగింపు ప్రసంగంతో రెండో వార్షిక ట్రైడెంట్ ఉపన్యాసం ముగుస్తుంది.

## ఎన్ఎంఎల్సీ ద్వారా విశాఖపట్నంలో ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన 459 భూభాగాల ఈ - వేలం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగానికి (డీపీఈ) చెందిన కేంద్ర ప్రభుత్వ పూర్తి యాజమాన్య సంస్థ? నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎంఎల్సీ) ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ - ఆర్ఐఎన్ఎల్) చెందిన వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన భూముల ఈ-వేలాన్ని ప్రకటించింది.

మొత్తం 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 459 భూభాగాల (ల్యాండ్ పార్శిల్స్) ను ఎలాంటి వివాదాలు, హక్కు దావాలు లేని (ఎన్‌కంబరెన్స్-ఫ్రీ) ప్రభుత్వ టైటిల్స్ తో పూర్తిస్థాయి విక్రయం కోసం ప్రతిపాదిస్తున్నారు. ఇందులో వ్యక్తిగత ప్లాట్ల పరిమాణం సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంది. ఈ వేలం ప్రక్రియను సులభతరం చేసేందుకు క్విర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యూఐపీఎల్)ను ట్రాన్సాక్షన్ కన్సల్టెంట్‌గా నియమించారు.

:హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెం: అన్ని రకాల పౌర, సామాజిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన పట్టణ నివాస ప్రాంతంలో... 456 నివాస ఎంఐజీ/ఎల్ఐజీ ప్లాట్లు ఉన్నాయి. ఈ స్థలాలకు 24 నుంచి 60 అడుగుల కాంక్రీట్ ప్రవేశ రహదారులు ఉండటమే కాకుండా, ఇవి జాతీయ రహదారి 16 కి అత్యంత సమీపంలో ఉన్నాయి. ఆటో నగర్, గాజువాక: బ్లాక్ 2 లో జాతీయ రహదారి 16 కి 0.5 కిలోమీటర్ల దూరంలో వాణిజ్య, రవాణా/ అవసరాలకు అనువుగా ఉండే 2,728 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన అత్యంత విలువైన స్థలంతో పాటు, బ్లాక్ 3 లో రెండు నివాస ప్లాట్లు ఉన్నాయి.

పోటీతత్వంతో కూడిన ఈ బిడ్డింగ్ ప్రక్రియను రైల్టెల్ ఈ - నివిద ఈ - ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫామ్‌పై రెండు విడతలుగా? 2026 అక్టోబర్ 12, 2026 అక్టోబర్ 16 తేదీలలో నిర్వహించనున్నారు

# సమ్మె హక్కును తాకట్టు పెట్టారు..

## సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి




కరీంనగర్, సెప్టెంబర్ 3: సింగరేణి బొగ్గు పరిశ్రమ కార్మికుల ప్రధాన హక్కైన సమ్మెను సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యానికి తాకట్టు పెట్టిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి ఆరోపించారు. గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ కార్మికుల హక్కులను కాపాడాల్సింది పోయి.. సమ్మె చేయాలంటూ కంపెనీ యాజమాన్యానికే లేఖ రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని రాజిరెడ్డి తెలిపారు. బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి సొంతింటి కలను సాకారం చేయడానికి తమ సంఘం ముందుండి ఉద్యమిస్తుందని అన్నారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో యాజమాన్యంతో రాజీపడకుండా హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సింగరేణిలో కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక ఆసుపత్రిని నిర్మించాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సంస్థ పరిధిలోని పలు ఆసుపత్రుల్లో కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని అన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా సింగరేణి ఆసుపత్రులను ఆధునీకరించాలని కోరారు. అవసరమైన వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే సింగరేణి పరిధిలోని ప్రతి ఏరియాలో సీబీఎస్ఈ పాఠశాలలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు సంస్థ మరింత బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్య, వైద్యం, నివాసం వంటి మౌలిక అవసరాల విషయంలో కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉందన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో మాత్రమే ఐక్య పోరాటాల పేరుతో నినాదాలు చేస్తుందని రాజిరెడ్డి విమర్శించారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కార్మికుల సమస్యలపై అదే స్థాయిలో పోరాటం చేయడం లేదని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో గుర్తింపు సంఘం తన బాధ్యతను గుర్తించాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో సీఐటీయూ నాయకులు మండే శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్. శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్రియాల ప్రాజెక్టులో ప్రమాదం

## ఐదుగురు కార్మికులకు గాయాలు

## వీరిలో కొందరికి వినిపిడి శక్తి లోపం!




కరీంనగర్, సెప్టెంబర్ 3: పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్ సింగరేణి సంస్థ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో ప్రమాదం జరిగింది. ప్రాజెక్టు లో ఎఫ్.బి.ఎల్ ఎయిర్ ట్యాంక్ బ్లాస్ట్ కావడంతో అక్కడే ఉన్న ఐదుగురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. గురువారం రోజున గోదావరిఖనిలోని ఏరియా ఆసుపత్రిలో కార్మికులకు చికిత్స కొనసాగుతోంది.

ఈ ప్రమాదంలో ఆపరేటర్ శ్రీనివాస్, ఫిట్టర్ కిరణ్, లక్ష్మణ్, హెల్పర్లు ప్రశాంత్, మనోజ్ గాయపడ్డారు.

సమాచారం తెలుసుకున్న ప్రాజెక్టు అధికారులు వారిని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కాగా గాయపడిన కార్మికులు కార్మికుల ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు అంటున్నారు. వీధిలో ఉండగా గాయపడ్డ వారిలో కొందరికి వినికిడి లోపం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఒకసారి గా భారీ శబ్దంతో ట్యాంకర్ బ్లాస్ట్ కావడం మూలంగా ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది.

### రక్షణ వైఫల్యం : బి ఎం ఎస్ నేత

సింగరేణి యాజమాన్యం రక్షణ వైఫల్యంతోనే ఆడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో ప్రమాదం జరిగిందని బిఎంఎస్ కార్మిక నాయకుడు యాదగిరి సత్తయ్య ఆరోపణలు వ్యక్తం చేశారు. కార్మికుల భద్రత నిర్లక్ష్యం చేయడంపై సత్తయ్య మండిపడ్డారు. రక్షణ సూత్రాలు సక్రమంగా పాటించడం లేదన్నారు.

# ఉత్తరాఖండ్ పాత్రికేయ బృందం హైదరాబాద్ పర్యటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల క్షేత్రస్థాయి సందర్శన, హైదరాబాద్ నగర సుసంపన్న వారసత్వ అనుభూతి లక్ష్యంగా ఉత్తరాఖండ్ రాష్ట్ర పాత్రికేయుల బృందం ఆగస్టు 31న నగరానికి చేరుకుంది. ఈ మేరకు డెహ్రాడూన్ పత్రికా సమాచార సంస్థ (పీఐబీ) అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ సంజీవ్ సుంద్రియాల్ నేతృత్వాన 15 మంది సభ్యుల పాత్రికేయ బృందం సెప్టెంబరు 4 వరకూ వివిధ ప్రాంతాలను సందర్శిస్తుంది. ఈ 5 రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజున హైదరాబాద్‌లోని 'పీఐబీ' కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ మానస్ కృష్ణకాంత్ సహా ఇతర అధికారులతో ఈ బృందం సమావేశమైంది.

తెలంగాణలో పరిణామాత్మక మీడియా రంగం గురించి, కేంద్ర ప్రభుత్వ విధానాలు- ప్రధాన పథకాలు, కార్యక్రమాలపై సమాచార ప్రదానం దిశగా పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) చేపట్టిన విస్తృత సమాచార-ప్రచార కార్యక్రమాల గురించి శ్రీమతి శృతి పాటిల్ ఈ సందర్భంగా వారికి వివరించారు.

ప్రగతి ప్రధాన వార్తా కథనాల నివేదన సౌలభ్యం దిశగా పీఐబీ నిర్వహించే కార్యక్రమాలు, పర్యటనలలో పాత్రికేయుల భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని ఆమె ప్రస్ఫుటం చేశారు. తదనుగుణంగా హైదరాబాద్ పర్యటన అనుభవాలను ఉత్తరాఖండ్ ప్రజలతో విశదంగా పంచుకోవాలని ఆమె కోరారు. అలాగే, ఆ రాష్ట్ర ప్రజానీకానికి తెలంగాణపై అవగాహన పెంచడంలో తమ వంతు పాత్ర పోషించాల్సిందిగా సూచించారు.

అనంతరం కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ పరిధిలోని 'ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్' (ఇన్‌కాయిస్)ను ఈ బృదం సందర్శించింది. సముద్ర పరిస్థితుల పర్యవేక్షణ, సునామీపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థ, అంచనాలు, హెచ్చరికల జారీ సహా సముద్ర సమాచార సేవలలో భారత సామర్థ్యాన్ని ఇక్కడి అధికారులు పాత్రికేయులకు వివరించారు.

ఈ పర్యటనలో భాగంగా 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సహా కార్మిక-ఉపాధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఒక 'ఈఎస్ఐసీ' ఆసుపత్రిని కూడా ఈ ప్రతినిధి బృందం సందర్శించనుంది. తద్వారా పోషకాహార పరిశోధన, ప్రజారోగ్య చర్యలు, ఉద్యోగులకు జాతీయ బీమా పథకం కింద లభించే ఆరోగ్య సంరక్షణ సేవలపై వారికి సంపూర్ణ అవగాహన కలుగుతుంది.

కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గల తెలంగాణ చేనేత-చేతివృత్తుల సంబంధిత ప్రదర్శనను ఈ ప్రతినిధి బృందం సందర్శిస్తుంది. రాష్ట్రంలోని సంప్రదాయ చేతివృత్తులకు, [illegible] చేయూతనివ్వడంలో ఈ రంగం పోషిస్తున్న పాత్రపై అవగాహనకు ఈ సందర్శన తోడ్పడుతుంది.

దేశంలో పేరెన్నికగన్న హైదరాబాద్ నగర సుసంపన్న సాంస్కృతిక-చారిత్రక వారసత్వంపై ప్రత్యక్ష అనుభూతి దిశగా సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, లాడ్ బజార్ తదితర చారిత్రక ప్రదేశాలను కూడా ఈ ప్రతినిధి బృందం సందర్శిస్తుంది.

# మునుగోడు రోడ్లకు మహర్దశ

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

## రూ.520 కోట్లతో రహదారుల అభివృద్ధి

## మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

### గ్రామాలను పట్టణాలతో అనుసంధానించే రహదారులకు ప్రాధాన్యం:



నల్గొండ, సెప్టెంబర్ 3: మునుగోడు నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారులను గుర్తించి త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చామని చెప్పారు. గ్రామాలను మండల కేంద్రాలు, ప్రధాన పట్టణాలతో అనుసంధానించే రహదారులకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త రహదారులను నిర్మిస్తామని చెప్పారు. రహదారి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్ణీత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుడిమల్కాపురం గ్రామం నుంచి సాయిగో నిభాయి వరకు రూ.32.90 కోట్లతో, సర్వేల్ నుంచి నారాయణపురం వరకు రూ.11 కోట్లతో, సర్వేల్ నుంచి పలివెల వరకు రూ.32. 30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# పాలనకు, ప్రజల ఆకాంక్షలకు నడుమ సంధానకర్తలుగా ఐఐఎస్ అధికారులది కీలక పాత్ర




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:20 09, 2023, 2024 బ్యాచ్‌లకు చెందిన భారతీయ సమాచార సేవల (ఐఐఎస్) గ్రూప్-ఎ ఆఫీసర్ ట్రెయినీల శిక్షణ ముగింపు, గ్రాడ్యేయేషన్ వేడుకను.. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ) ప్రాంగణంలో ఈ రోజు ఘనంగా నిర్వహించారు.

ఈ ముగింపు కార్యక్రమంలో సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమాచార ప్రసార వ్యవస్థ పాలనలో అత్యంత కీలకమైన భాగమన్నారు. మారుతున్న సాంకేతికతలు, డిజిటల్ వేదికలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులను అందిపుచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేధ నేడు సరికొత్త విప్లవాత్మక మార్పులు తెస్తోందని, అత్యాధునిక సాంకేతికతలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదే సమయంలో తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లు, కృత్రిమంగా సృష్టించే కంటెంట్ వంటివి కొత్త సవాళ్లను విసురుతున్నాయని గుర్తుచేశారు.

సమాచార వ్యవస్థ ఎల్లప్పుడూ ద్విముఖ ప్రక్రియగా ఉండాలన్న ఆయన.. ప్రభుత్వ విధానాలను, వాటి అమలును మెరుగుపరచడానికి ప్రజాభిప్రాయం దోహద పడుతుందన్నారు. వార్తలను అందించడంలో వేగంతోపాటు.. అదే స్థాయిలో కచ్చితత్వం, విశ్వసనీయత కూడా కీలకమని స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసే ప్రతి సమాచారమూ ఒక వ్యవస్థ ఆమోదాన్ని పొంది ఉంటుందని గుర్తు చేస్తూ.. ఆ విలువల్లో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

అధికారులు తమ నైపుణ్యాలను నిరంతరం వదును పెట్టుకోవాలని, క్షేత్రస్థాయిలో నిత్యం అనుసంధానమై ఉండాలని ఆయన సూచించారు. కేవలం సమాచార ప్రసారానికే పరిమితం కాకుండా.. పాలన సంబంధిత ఇతర బాధ్యతలను అప్పగించినప్పుడు వాటిని కూడా సమర్థంగా అర్థం చేసుకుని నిర్వహించడానికి సన్నద్ధులుగా ఉండాలన్నారు. అన్నింటికీ మించి, ప్రజలే కేంద్రంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రత్యేకించి నిరుపేదలకు తమ పని ఎంతవరకు సహాయపడుతోందో అధికారులు ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అలా జరగని పక్షంలో తమ ప్రణాళికలను పునఃసమీక్షించుకోవాలని, ప్రజల సమస్యల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ వారికి మేలు చేసేలా పనిచేయాలని కోరారు.

ఐఐఎంసీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రజ్ఞా పాలివాల్ గౌర్ మాట్లాడుతూ... ఈ పీజీ డిగ్రీని అందుకుంటున్న తొలి ఆఫీసర్ ట్రెయినీలు వీరేనన్నారు. ఐఐఎంసీ విద్యాపరమైన పురోగతితోపాటు సమాచార ప్రసార రంగంలో నైపుణ్య శిక్షణకు సంస్థ ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమన్నారు. ప్రసారమంటే సమాచారాన్ని కేవలం చేరవేయడమే కాదని, అది ప్రజల్లో అవగాహన కల్పించేలా ఉండాలని అన్నారు. స్పష్టత, నిష్పాక్షికత, సునిశితత్వంతో ట్రెయినీ అధికారులు తమ బాధ్యతలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# ఈ కిష్టుడు ..మనకిష్టుడు!



-కె.కౌండిన్య తిలక్
8790920745

అతడు
ముద్దుగారే యాశోదా తనయుడు, గో-గోపికా ప్రియుడు, వేణుగానలోలుడు, రసికుడు, రమణీమానస చోరుడు, హితుడు, సఖుడు, సచివుడు, బాంధవుడు, రథచోదకుడు, సలహాదారుడు, చక్రధరుడు, మధురవచనరచనా చతురుడు, రాయబారి, యుద్ధనిపుణుడు, సలహాదారుడు, వ్యక్తిత్వవికాస నిపుణుడు, ప్రళయ భీకరుడు, ప్రణయ శేఖరుడు, దార్శనికుడు, మార్గదర్శి, లీలామానుష విగ్రహుడు, ఆధ్యాత్మిక వికాస పరమస్వరూపుడు,శిష్ట రక్షకుడు, దుష్ట శిక్షకుడు, ధర్మ సంస్థాపకుడు, జగద్గురుడు

కానీ మనం అందరం నచ్చేది మెచ్చేది మాత్రం గోకులంలో యశోద ఇంటిలో చూసిన అల్లరి కృష్ణుడిని..

**అధరం మధురం వదనం మధురం**
**నయనం మధురం హసితం మధురమ్**
**హృదయం మధురం గమనం మధురం**
**మధురాధిపతేరఖిలం మధురమ్**

ఒక చేతిలో వెన్నముద్దతో , మోకాళ్లమీద దోగాడుతూ, ధూళి శరీరంతో, పెరుగు అంటిన ముఖంపై నున్న కస్తూరి తిలకం పై ముంగురులు కదలాడుతూ ,మెడ పైన వేలాడుతూ ఉన్న పులిగోరు పతకంతో, కాలి అందెలమోతతో, శోభాయమానంగా చిరునవ్వులు చిందించే ఆ చిన్ని శిశువును చూసి ఎవ్వరు ఆనందించరు?

అమ్మా! నేను వెన్న తినలేదు! ఉదయమనగా ఆవుల్ని మేపడానికి మధువనానికి వెళ్ళాను. సాయంకాలం తిరిగివచ్చాను. పగలంతా మురళి వాయిస్తూ చెట్ల నీడలో తిరుగుతున్నాను. నాకు వెన్న దొంగతనం చేసే సమయం ఎక్కడుంది?పోనీ ఏదో సమయం చూసి చేసానుకున్నా ఎలా చేస్తాను?నేనా చిన్నవాణ్ణి, నా చేతులూ చిన్నవే! ఇంకెలా అంత ఎత్తున ఉన్న ఉట్టిని అందుకుంటాను?

అంటూ నమ్ము బలికే ఆముగ్ధమనోహర రూపం చూస్తుంటే ఎవరికి కళ్ళల్లో నుండి ఆనంద బాష్పాలు కారవు?

ఏ దంపతులు ఇలాంటి కొడుకును కోరుకోరు?

ఇలాంటి శిశువు చేసే అల్లరి ఎవరికి ఆనందం కలిగించదు?

మరి ఆ అల్లరి ఎలాంటిదో,ఎంతటి జగదానంద కారకమో చూద్దామా.

**ఓయమ్మ నీకుమారుడు**
**మాయిండ్లను పాలు పెరుగు మననీదమ్మా!**
**పోయెదమెక్కడికైనను**
**మా యన్నల సురభులాన మంజులవాణీ!**

ఇది ఆంధ్ర దేశమందలి అబాలగోపాలాన్ని ఆనంద భక్తి పారవశ్యములోముంచి శ్రీకృష్ణశైశవమాధుర్యాన్ని తెలియచెప్పినపద్యం . కృష్ణుడి అల్లరికి పతాకస్థాయి సన్నివేశం.

శ్రీమద్భాగవతములోని ఈ పద్యము పోతనగారిది. ఈ పద్య మొక్కటే చాలు గోపికలను కృష్ణుడు కపట శైశవముతో ఎంతగా బాధపెట్టాడో తెలియచెప్పడానికి, మనల ఆనంద పరచడానికి.

చిన్ని కృష్ణుడి శైశవక్రీడలలోని ముగ్ధమాధుర్యాన్ని తెలియచేస్తూ, ఓపలేని గోపమ్మల నిందాపర్వం వర్ణిస్తూ, తద్వారా కిట్టయ్య అల్లరిని లో ఉన్న ఆనందాన్ని, పాఠకులకు అనుభవైకవేద్యం చేయడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

సాక్షాత్ శ్రీమహావిష్ణువు శ్రీ కృష్ణుడిగా అవతరించినవేళ, తాను పరమాత్ముడైనా మానుషత్వాన్ని ప్రదర్శిస్తూ గోకులంలో, గోపమ్మల ఇండ్లలో ఆడిన ఆటపాటలు చేసిన ఆగడాలు అంతా ఇంతాకాదు.

అందువల్ల నాటినుండి నేటి వరకు భారతీయులందరూ చిన్న పిల్లల అల్లరిలో చిన్నికృష్ణుణ్ణి, చిన్నికృష్ణుడి అల్లరిలో శైశవమాధుర్యాన్ని, ముగ్ధత్వాన్ని చూస్తూ చిన్మయానందులవుతున్నారు. చిట్టి పొట్టి అడుగులను వేస్తూ అతడు చేసిన అల్లరిని,ఆగడాలను కొండొకచో శ్రుతిమించిన దుశ్చేష్టితములను చూసి, పిడుగు బుడుగులున్న తల్లి దండ్రులు,ఈఆగడాలు అచ్చు 'మాకన్నయ్య' వే అంటూ మురిసి పోతూ అనన్య ఆ"నందు" లవుతున్నారు.



వెన్నదొంగ కపటశైశవమును, మహాభాగవతములో పోతన అద్భుతముగా వర్ణించారు. ముందుగా పోతనకు శిరసువంచి పాదాభివందనములు.

పోతన కొంటె కృష్ణుని అల్లరిని వర్ణించినప్పుడు , దానిని మూడువిధములుగా చూపారు.

అ) కృష్ణుడు ఇంటింటా దూరి అలవిమాలిన అల్లరి చేయడం.

ఆ)ఈ అల్లరి వెనుక గల ఆధ్యాత్మిక రహస్యాన్ని అర్థము చేసుకోలేని, భగవంతుడు తమ పట్ల చూపుతున్న అవ్యాజ ప్రేమామృత మును మహాప్రసాదంగా భావించలేని గోపికలు,(లేదా గ్రహించినా, భావించినా మానుషరూపములో ఉన్న గోపమ్మలు తమ సహజ మానుషత్వాన్ని ప్రదర్శిస్తూ,) కృష్ణుడిఆగడాలను భరించలేక అతడిని నిందిస్తూ,యశోదమ్మ ఇంటికి పోట్లాటకు రావడం.

ఇ) తెలుగు తల్లి,తెలుగు ఇల్లాలు ఎలా తన కొడుకు చేష్టలకు స్పందిస్తుందో అలాగే యశోదమ్మ స్పందించడం.

ఇక "ఆ కుమార శేఖరుండు,కపటశైశవంబున దొంగ జాడలంగ్రీడింప,గోపికలోపికలేక "యశోద కడకు వచ్చి,అవ్వ చేసిన వైనము కడు రమణీయం.మనకు స్మరణీయం.

ఇక పోతన కృష్ణుడి అల్లరి చూద్దాము.

అల్లరితో పాటు కొంటెతనం కొండొకచో లలిత శృంగారం కలగలిసాయి.

ఔను! త్రేతాయుగం నుండి ద్వాపర యుగం వచ్చేసరికి,రాముడు మంచి బాలుడు నుండికృష్ణుడు కొంటే బాలుడు వరకు వచ్చింది వ్యవహారం.

పోతన కృష్ణుడు అల్లరిలో చాలా అడుగులే ముందుకు వేసాడు. సందర్భంలో కోపించిన గోపికలు యశోద కడకు వచ్చి కృష్ణుని అల్లరి జాబితాను వివరించారు.

-మాపిల్లలకే పాలు లేవని బాలింతలు మొఱలు పెడుతుంటే మీ పిల్లవాడు నవ్వుతూ, దూడలను విడిచాడు.

-నీ బిడ్డ పాలన్ని ఇతరులకుపోసి మిగిలిన కుండలన్నీ పగులగొట్టాడు.

-పుట్టిపుట్టనట్టి నీబిడ్డమాఇంట్లో దూరి రోలు, పీటలనెక్కి అప్పటికీ ఉట్టిపై కుండలు అందకపోతే కుండ క్రింద పెద్ద తూటు పెట్టి మీగడపాలు చేరలపట్టి త్రాగాడు.

-ఒక ఇంట్లో మీగడపాలుత్రాగి, కొంచెము మీగడను ఆ యింటి కోడలిమూతికిరాసాడు. దానితోఆమె అత్త ,కోడలే దొంగ అంటూ కోడలిని కొట్టింది.

-ఒకింట్లో దూరి చక్కగ నెయ్యిత్రాగి, ఖాళీ కుండలను మరొక ఇంట్లో పెట్టగా, వారికీ వీరికీ పెద్దగొడవే అయింది.

-నా కంటే పెద్ద దేవుడు ఎవరు అంటూ మాయింట్లో నున్నదేవుళ్ళపై ఎంగిళ్ళు వేసాడు.

-చక్కగా నిదురపోతున్ననా బిడ్డ జుట్టును లేగతోకకు కట్టి ఇరువురిని వీధుల్లోకి నెట్టాడు.

ఇంతవరకు బాగానే ఉంది. ఇకముందు చూడండి.

-వెన్నదినబొడగని మా, పిన్నది యడ్డంబు వచ్చి పిఱిదికి దీయన్ జన్నొడిసి పట్టి చీరెను

-ఇమ్మగువ తన్ను వాకిట, గ్రుమ్మరుచో జేరినిలుపుకొని పేరడుగన్ నెవ్వొమ్మవి గఱచి వడిజనె

-మాబిడ్డ జలకమాడగ, నీబిడ్డడు వలువ దెచ్చె

-ఇచ్చెలువ జూచి ముచ్చిలి, యచ్చుగ నుఱికించుకొనుచు నరిగెద నాతో వచ్చెదవా యని అన్నాడు.

- కొడుకులు లేరని మరొక సతి, కడు వగవగ దన్ను మగనిగా గైకొనినన్ గొడుకులు కలిగెదరని పై బడినాడు.

-చూలాలం దలగుమనిన, జూలగుటకు నేమూలంబు చెప్పమనె

-మా మగవారలటువోవగ జూచి మంతనమునకున్ దగ జీరి పొందునడిగెను.

-తెఱవ యొకతె నిద్రింపగా, నెఱగట్టిన వలువనీడ్చి నేటగు తేలుంగఱిపించె నీకుమరుండు

-నా కొడుకును నాకోడలు నేకతమున బెనగ బామునీసుతుడు వైవంగోక లెఱుంగక పాఱిన, గూకలిడెన్నీ సుతుండు.

-తరుణి యొకతె పెరుగు దరుచుచు దుది వంగి వెన్నదియ్యనొదిగివెనుక గదిసి మగువ! నీ సుతుండు మగపోడుములు సేయసాగినాడు.

అని చెబుతూ" ఒక ఇంటిలో బాడునొక యింటిలోనాడు నొకయింటిలో నవ్వు నొకటందిట్టునొకట వెక్కిరించు నొక్కొకచో మృగ పక్షి ఘోషణములు పరగజేయు నిట్లు జేసి వెనుకనెక్కడ బోవునో" అంటూ కృష్ణుడు సర్వాంతర్యామి అని ఎరుగక వాపోయారు.

అంతటితో వారూరుకోక అతడి చేష్టలు తెలుపుతునే, " **జిన్నికుమారుండె యితడు శీతాంశుముఖీ" , "యీ ముద్దుగుర్ల డల్పుడెచెపుమా", చిత్రమిట్టిది గలదే", "ఇది వినుము శిశువు పనులే తల్లి" ,"జగమున్నిట్టి శిశువుచదువంబడనే", "రాచబిడ్డడైన అవ్వమేలే",** అంటూ సంభ్రమ సంశయావేశావేద నాశ్చర్యాదులను ప్రకటించారు.

**"కడు లచ్చి గలిగెనేనియు గుడుతురు గట్టుదురుగాక కొడుకులనగుచున్**
**బడుగులవాడలపై బడవిడుతురె రాకాంతలెందు విమలేందు ముఖీ"** అంటూ నిందానిష్ఠూరాలాడారు.

పోతన గోపమ్మలు బాగా విసుగు పడి, పోయెదమెక్కడికైనను అంటూ, పెద్దింటి వాళ్ళ ఆగడాలను భరించలేని సగటువర్గాల ప్రజలు పొందే బాధలను వ్యక్తము చేస్తూ ,నిస్సహాయత చూపారు.

ఇక ఇదంతా ఒక ఎత్తు అయితే ,వీరిని యశోద సమాధానపరచడము మరొక ఎత్తు.

ఈవిడ అచ్చుము మన పొరుగింటి ఇల్లాలే. తెలుగు తల్లియే.

తమపిల్లలు మంచివారే,అనవసరంగా ఇతరులు ఆడిపోసుకుంటున్నారు అనుకునే మనస్థత్వము కలది.

యశోద తన కొడుకును వెనుకేసుకొని వచ్చింది.

**"(చ) నన్నువిడిచి చనడిట్టటు, నెన్నడు బొరుగిండ్లత్రోవలెఱుగడు నేడుం**
**గన్నులు తెఱువని మాయీ,చిన్నికుమారకుని అవ్వసేయందగునే"**
**ఏమీ తెలియని తన పసికందునుపట్టుకొని నిందిస్తారా** అంటూ, వెనుకేసుకు వచ్చింది.

**అన్యమెఱుగడు తనయుంతనాడుచుండు మంచివాడితడెగ్గు లుమానరమ్మా**

అంటూ తనకొడుక్కు తాను కాండక్ట్ సర్టిఫికెట్ ఇచ్చుకుంది.

శ్రీకృష్ణుడి అల్లరి,బాల్య చేష్టలు,గోపికలకోపం, యశోద సర్ది చెప్పడం అంతాహృద్యంగా అందమైన చలనచిత్రంగా మన కళ్ళముందు కదిలి, పోతనకు వేనవేల ధన్యవాదాలను సమర్పించుకొనేటట్లు చేస్తాయి.

అయితే పండితులు మాత్రమే ఈ లీలా రహస్యాలు చెప్పగలరు.

పాపం గోకులంలోని వారికి ఈ విషయాలు యేమి తెలుస్తాయి.

వెన్న దొంగతనం నెపం తో ... గోపికల పాపాలను దొంగిలించి వాళ్లను పునీతులను చేసే వాడని ..

గోపికా వస్త్రాపహరణ నెపంతో..నదీ స్నానం చేసేటప్పుడు నగ్నంగా స్నానం చేయరాదని, గోపికలు కృష్ణుని భర్తగా పొందాలని కోరుకుంటూ కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించే సమయంలో యమునా నదిలో వివస్త్రలై స్నానం చేసారని,. వారు చేస్తున్న ఈ తప్పును సరిచేసి వారికి కలిగిన దోషం పోగొట్టడానికి కృష్ణుడు వారి వస్త్రాలను అపహరించాడని. ఇక పోతన గారు ఎంచుకున్న భాష,వాతావరణము తెలుగు లోగిళ్ళకు దగ్గరగానుండి ,మనం నిత్యం చూస్తున్న విషయంగా తోచి ఆనందం కలిగిస్తుంది.

పోతన అంభోజాక్షి, కలకంఠి, విమలేందుముఖి, హేలావతి, గుణాఢ్యా, మంజులవాణీ, మృగాక్షీ, పర్వేందుముఖీ వంటి సంబోధనలను గొల్లెతలతో, యశోదకు ప్రయోగింపజేసి సంభాషణను రక్తికట్టించాడు.

పోతన ప్రతి పద్యములో స్త్రీకి గల పర్యాయ పదములను ఔచితీ వంతముగా ప్రయోగిస్తూ ,అవసరమగుచోట అచ్చతెలుగు పదాలు వాడుతూ సన్నివేశములను సుందరముగా మలిచారు.

అన్నమయ్య యశోద కూడా "కానరటె పెంచరటె" అను సంకీర్తనలో ,గోపికలకు గడుసుగా సమాధానంగా ఇవ్వడమే కాక ,కన్నయ్యను వెనుకేసుకొస్తుంది.

అందుకే ఈ శ్రీకృష్ణ లీలల ఘట్టం మధురాతిమధురంగా ఉంటుంది. మరియు బంగారానికి తావి అబ్బినట్లుగా ఈ లీలలను వర్ణిస్తున్నప్పుడు పోతన కవిత్వం రసభరితంగా ఉండి పాఠకులను మరింత రంజింపచేస్తుంది.

అత్యద్భుత లీలను ప్రదర్శించి, మనుకు ఆనందము పంచిన ఆ లీలామానుషవిగ్రహధారికి కోటిదండాలు. వానిని అక్షరబద్ధము చేసిన కవివరేణ్యులకు వేనవేల దండాలు.

అష్టమ గర్భుడై ,అష్టమి వేళ జన్మించి ,అష్టకష్టాలను అనుభవించి, మానవ జీవన దృష్టి పథమును నిర్దేశించడానికి ,అష్టాదశాధ్యాయాలను బోధించిన అల్లరి కిష్టుడికి...అందరి కిష్టుడికి ..

కృష్ణం వందే జగద్గురుం!

## రాధాకృష్ణులుగా చిన్నారుల సందడి

### నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నిజామాబాద్, సెప్టెంబంర్ 3: ఆంధ్రప్రభ: నగరంలోని నవ్యభా రతి గ్లోబల్ పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారులు పాఠశాల ప్రాంగణంలో సందడి చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

పాఠశాల చైర్మన్ సంతోష్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడి జీవిత విశేషాలు, బాలకృష్ణుడి లీలలను ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా చైర్మన్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని ఆకాంక్షించారు. పండుగల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారిలోని సృజనాత్మకతను వెలికితీయవచ్చని తెలిపారు.

కరస్పాండెంట్ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల పట్ల గౌరవ భావాన్ని కలిగిస్తాయని అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ డైరెక్టర్ లత, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ సరిత, సుధీర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గూడ్స్ రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3:గూడ్స్ రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని గాయత్రిగుట్టకు చెందిన వరం శెట్టి దీపక్ (19) కేసముద్రం రైల్వే స్టేషన్ సమీపంలోని పెద్దయి చెరువు వద్ద గూడ్స్ రైలు కిందపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై దర్యాప్తు చేపట్టారు. యువకుడు ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## ఎల్కతుర్తిలో కాంగ్రెస్ సంబరాలు

### వెయ్యి రోజుల ప్రజా పాలన నేపథ్యంలో భారీ ర్యాలీ




వరంగల్, సెప్టెంబంర్ 3: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రైతుభరోసా, రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల బలోపేతంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శ్రీనివాస్ తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ఎల్కతుర్తి మండల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు మండల కాంగ్రెస్ పార్టీ తరపున, ప్రజల తరఫున శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు, సీనియర్ నాయకులు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచులు గోడిశాల యాదగిరిగౌడ్, కొమ్మిడి రాజిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం అనిల్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్ గోడిశాల రాజయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, బావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్‌గౌడ్, సీనియర్ నాయకులు వీరమల్ల రంజిత్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, ముప్పు మహేందర్, అంబాల శ్రీకాంత్, మంద సుమన్, డాక్టర్ రమేష్, గోడిశాల నరేష్, వేణు, పెండ్యాల భాస్కర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా!

అమరావతి, సెప్టెంబంర్ 3: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంపై అక్రమార్కుల కన్ను పడింది.

కుబీర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని కొన్ని గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పేద కుటుంబాలకు అందిస్తున్న బియ్యాన్ని కొందరు తక్కువ ధరకు సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని కొన్ని గ్రామాలు రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, నిల్వలు, రవాణాకు అడ్డాలుగా మారుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాల్లో బియ్యం తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అక్రమ రవాణాపై నిఘా కొరవడటంతో దందా నిర్వాహకులు మరింతగా రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం పేద కుటుంబాల ఆహార భద్రత కోసం అందిస్తున్న రేషన్ బియ్యం వారికి ఉపయోగపడాల్సి ఉండగా.. కొందరు అక్ర మార్కులు దానిని అక్రమ వ్యాపారంగా మార్చుకుం టున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతు సమస్యలపై నల్లగొండ తాసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నా

నల్గొండ, సెప్టెంబర్ 3: రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన, వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తాసీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టిన ధర్నాలో భాగంగా నల్లగొండ మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు.

పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకటరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కల్లుగీత కార్మిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నాయకులు ఆరోపించారు.

## ఈనెల 4న టీటీడీ ఆలయాల్లో గోకులాష్టమి వేడుకలు

తిరుపతి , సెప్టెంబంర్ 3:: ఈనెల 4న శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో గోకులాష్టమి వేడుకలను స్థానిక ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వివరించారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ కృష్ణస్వామివారి ఆలయం, తిరుపతిలోని గోవిందరాజస్వామివారి ఆలయం, కపిలతీర్థం వద్దనున్న వేణుగోపాలస్వామివారి ఆలయం, నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, వాహనసేవ, గోపూజ, గోకులాష్టమి ఆస్థానం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయని పేర్కొన్నారు. సెప్టెంబరు 5న ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

# వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత

## (సెప్టెంబర్ 4... వన్యప్రాణుల పరిరక్షణ అవగాహనా దినం సందర్భంగా)



"వనము లేక శార్దూలము నిలువలేదు.. శార్దూలము లేక వనము మనుగడ సాగింపలేదు" అనే ప్రాచీన మహాభారత సూక్తి అరణ్యానికి, అరణ్యవాసులకు మధ్యగల విడదీయరాని అవినాభావ బంధాన్ని తేటతెల్లం చేస్తుంది. చెట్టు చేమలు, కొండ కోనలు, వాగు వంకలతో కూడిన అడవి నిండుగా విలసిల్లితేనే వన్యజీవులకు ఆవాసం దక్కుతుంది; వన్యప్రాణుల సంచారం నిర్విఘ్నంగా సాగినప్పుడే అడవి ప్రాణవాయువును పూరిస్తుంది; ఆ వనరాశి పచ్చదనంతో పరిఢవిల్లినప్పుడే యావత్ మానవజాతి మనుగడ సురక్షితంగా ఉంటుంది. ప్రకృతి ఒడిలో కోట్లాది సంవత్సరాల పరిణామ క్రమంలో సమస్త జీవకోటితో కలిసి రూపొందిన వన్యప్రాణులు కేవలం కంటికి ఇంపునిచ్చే అటవీ అలంకారాలు ఎంతమాత్రం కావు. అవి విశ్వ సమతుల్యతను, పర్యావరణ వ్యవస్థను నిలబెట్టే మూలస్తంభాలు. ఆహార గొలుసులో ఒక అల్ప కీటకం మొదలుకొని మహాగజం, శార్దూలం వరకు ప్రతి జీవికీ ప్రకృతి ఒక నిర్దిష్టమైన బాధ్యతను, కర్తవ్యాన్ని అప్పగించింది. ఆ గొలుసులో ఏ ఒక్క లంకె తెగిపోయినా, ఏ ఒక్క జీవజాతి శాశ్వతంగా అంతరించిపోయినా దాని తీవ్ర ప్రభావం క్రమంగా ఆహార పిరమిడ్ మొత్తం వ్యాపించి, పర్యావరణ వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. కాబట్టి మూగజీవులను సంరక్షించుకోవడం అనేది కేవలం జీవకారుణ్యమో లేక దయాధర్మమో కాదు; అది మనిషి తన భవిష్యత్ మనుగడను సురక్షితంగా ఉంచుకోవడానికి చేయవలసిన అత్యంత కీలకమైన సామాజిక కర్తవ్యం.

సెప్టెంబర్ 4వ తేదీని అంతర్జాతీయంగా అనేక దేశాలలో వన్యప్రాణుల సంరక్షణపై చైతన్యం తెచ్చే ప్రత్యేక దినోత్సవంగా పరిగణిస్తున్నారు. వాస్తవానికి 2005లో అమెరికా వేదికగా ప్రారంభమైన ఈ 'నేషనల్ వైల్డ్‌లైఫ్ డే' దినోత్సవం క్రమంగా ప్రపంచవ్యాప్తంగా వన్యజీవుల ఆవశ్యకతను విస్తృతంగా గుర్తుచేసే ఒక మహత్తర వేదికగా మారింది. ఐక్యరాజ్యసమితి అధికారికంగా మార్చి 3న 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం'గా నిర్వహిస్తున్నప్పటికీ, అరణ్య పరిరక్షణ, జీవవైవిధ్య విలువలపై ప్రజల్లో విజ్ఞానాన్ని, విస్తృత ఆలోచనను రేకెత్తించేందుకు సెప్టెంబర్ 4 వంటి ప్రతి సందర్భమూ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. ఆధునిక కాలంలో మేధో వికాసం పెరిగి, సాంకేతిక ఆధిపత్యం సాధించినంత మాత్రాన భూమండలానికి మనిషి యజమాని అయిపోలేడు. మట్టి నుంచి పుట్టి మట్టిలో కలిసే సృష్టి క్రమంలో మానవుడు కూడా ప్రకృతిలో ఒక భాగం మాత్రమే తప్ప ప్రకృతిని శాసించే అధినేత కాదనే వినమ్రత అవసరం. మానవజాతి కంటే కొన్ని కోట్ల సంవత్సరాల ముందే ఈ ధరణిపై ఎన్నో అపురూప జీవజాతులు విలసిల్లాయి. భూమి చరిత్రలో గతంలో జరిగిన వాతావరణ మార్పులు, వైపరీత్యాల వల్ల జాతులు అంతరించిన వేగం కంటే, ప్రస్తుత ఆధునిక కాలంలో మనిషి అనుసరిస్తున్న స్వార్థపూరిత, మితిమీరిన దోపిడీ విధానాల వల్ల జీవజాలం నాశనమవుతున్న వేగం వందల రెట్లు పెరిగిపోవడం ఆందోళనకరం. అడవుల విచక్షణారహిత నరికివేత, మానవ నివాసాల విచ్చలవిడి విస్తరణ, పచ్చని కొండల గుండెలను పిండిచేసే అశాస్త్రీయ గనుల తవ్వకాలు, జీవావరణాల నడిబొడ్డున పరుచుకుంటున్న రహదారులు, రైల్వే మార్గాలు, పారిశ్రామిక విషతుల్య రసాయనాలు, పూడ్చివేతలకు గురవుతున్న చిత్తడి నేలలు, అక్రమ వేట, వన్యప్రాణి శరీర భాగాల స్మగ్లింగ్ మహమ్మారి.. ఇవన్నీ కలిసి సహజ జీవవైవిధ్యాన్ని క్రమంగా ఊపిరాడకుండా చేస్తున్నాయి.

భారతదేశం అనాదిగా విశిష్ట భౌగోళిక, జీవావరణ వైవిధ్యానికి పవిత్ర నిలయం. హిమవత్పర్వత శిఖరాల నుంచి సాగరతీర పశ్చిమ కనుమల వర్షారణ్యాల వరకు, ఈశాన్య నిత్యహరిత అరణ్యాల నుంచి మధ్య భారత సాలవనాల వరకు, తెలుగు నేలల్లోని నల్లమల, శేషాచలం దండకారణ్యాల నుంచి సాగర సంగమ చిత్తడి నేలల వరకు భరతభూమి ఎన్నో వేల జీవజాతులకు ఆలవాలమై ఉంది. పులి, చిరుత, ఏనుగు, సింహం, అడవి దున్న, కృష్ణజింక, ఎలుగుబంటి మొదలుకొని గగనవీధుల్లో విహరించే శతసహస్ర విహంగ సంతతి, నదీ ప్రవాహాల్లో జీవించే జలచరాలు, నేల తల్లిని సారవంతం చేసే ఉభయచరాలు, కీటకాల వరకు ప్రతి ఒక్కటీ ప్రకృతీ సంవిధానంలో కీలక చక్రాలు. ఈ సమతుల్యతను కాపాడేందుకు దేశంలో బలమైన చట్టపరమైన పునాది ఏర్పడింది. 1972లో తీసుకువచ్చిన 'వన్యప్రాణి సంరక్షణ చట్టం' అటవీ జీవులకు కవచంలా నిలిచింది. కాలక్రమంలో పర్యావరణ పరిరక్షణను మరింత పటిష్టం చేసేలా 2022లో ఈ చట్టానికి సమగ్ర సవరణలు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ఎ)(జి) పౌరుల ప్రాథమిక విధులను ప్రస్తావిస్తూ? అడవులు, నదులు, సరస్సులు, వన్యప్రాణులతో కూడిన సహజ పర్యావరణాన్ని పరిరక్షించడం, అభివృద్ధి చేయడం మరియు సర్వ ప్రాణుల పట్ల కరుణ కలిగి ఉండటం ప్రతి భారతీయుడి నైతిక కర్తవ్యమని స్పష్టం చేయడం మన ప్రజాస్వామిక శాసనాల ఘనత.

భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చరిత్రలో 'ప్రాజెక్ట్ టైగర్' ఒక ప్రపంచ స్థాయి విప్లవాత్మక మైలురాయిగా నిలిచింది. ఒకప్పుడు వేల సంఖ్యలో ఉన్న పెద్దపులులు అడ్డగోలు వేట కారణంగా దారుణంగా తగ్గిపోయిన విపత్కర పరిస్థితుల్లో, 1973లో కేవలం 9 రిజర్వులతో అంకురార్పణ జరిగిన ఈ మహత్తర కార్యక్రమం నేడు 18 రాష్ట్రాల్లో 58 ప్రాజెక్ట్ టైగర్ రిజర్వులకు విస్తరించింది. సుమారు 84,487 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణంలో విస్తరించిన ఈ రక్షిత అరణ్యాలు పులుల ఆవాసాలకు శ్రీరామరక్షగా మారాయి. 2006లో కేవలం 1,411 పులులు మాత్రమే మిగిలి ఉన్నట్లు లెక్కతేలగా, నిరంతర నిఘా, కట్టుదిట్టమైన శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక కెమెరా ట్రాపింగ్ వ్యవస్థల ద్వారా చేపట్టిన చర్యలతో 2010 నాటికి 1,706కు, 2014కు 2,226కు, 2018 నాటికి 2,967కు పులుల సంతతి పెరిగింది. 2022 నాటి శాస్త్రీయ అంచనాల ప్రకారం దేశంలో పులుల సగటు సంఖ్య 3,682కు చేరుకోవడం భారత్ సాధించిన అసమాన పర్యావరణ విజయం. యావత్ ప్రపంచంలోనే ఉన్న మొత్తం అడవి పులుల్లో దాదాపు 70 శాతం ఒక్క భారతదేశంలోనే స్వేచ్ఛగా విహరిస్తుండటం మనకు గర్వకారణం మాత్రమే కాదు, అంతే స్థాయి అంతర్జాతీయ బాధ్యతను కూడా మన భుజస్కంధాలపై ఉంచుతోంది. ఎందుకంటే పులి అనేది ఒక 'అంబ్రెల్లా స్పీసీస్' (ఛత్ర జాతి). అగ్రశ్రేణి వేట మృగమైన పులిని కాపాడటం అంటే కేవలం ఒక్క జంతువును బతికించడం కాదు; అది తిరిగే గడ్డి భూములు, దానికి ఆహారమయ్యే శాకాహార జంతువులు, ఆ గడ్డిని పెంచే వృక్షజాతులు, ఆ వృక్షాలకు ఆధారమైన నీటి ఊటలు, వాగులు, నేల సమగ్రత.. వెరసి ఒక సంపూర్ణ అరణ్య జీవావరణాన్ని సజీవంగా నిలబెట్టడమే.

అయితే సంఖ్య పెరిగినంత మాత్రాన సంరక్షణ లక్ష్యం పూర్తయినట్లు భావించలేము. జంతువులకు అత్యంత ముఖ్యమైనది వాటి 'ఆవాస సమగ్రత'. అడవుల మధ్య గుండా ఎలాంటి పర్యావరణ రక్షణ ప్రమాణాలు లేకుండా హైవేలు, రైలు పట్టాలు, విద్యుత్ గ్రిడ్లు విస్తరిస్తుండటం వల్ల వన్యజీవుల సహజ సంచార కారిడార్లు శాశ్వతంగా తెగిపోతున్నాయి. ఏనుగులు, పులులు, చిరుతలు తమ సంతానోత్పత్తికి, ఆహార అన్వేషణకు ఒక అటవీ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళ్లే వన్యప్రాణి నడకదారులు మూసుకుపోవడం వల్లే నేడు 'మనిషి-వన్యజీవి సంఘర్షణ' విపరీతంగా రగులుతోంది. గ్రామాల్లోకి ఏనుగుల గుంపులు చొరబడటం, పొలాల్లో పశువులపై చిరుతల దాడులు పెరగడం వన్యజీవుల తప్పు కాదు; వాటి పూర్వీకుల సంచార మార్గాలను మనిషి తన కాంక్రీట్ కట్టడాలతో ఆక్రమించడమే ఇందుకు మూలకారణం. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ తాజా సమాచారం ప్రకారం దేశంలో 106 జాతీయ పార్కులు, 564 వన్యప్రాణి అభయారణ్యాలు, 99 పరిరక్షణ రిజర్వులు, 218 సామాజిక రిజర్వులు కలిపి సుమారు 987 రక్షిత ప్రాంతాల మహత్తర వ్యవస్థ ఏర్పాటైనప్పటికీ, ఈ రక్షిత పరిధుల ఆవలి అడవులు, రెవెన్యూ అటవీ భూములు, గ్రామీణ సరిహద్దులను అనుసంధానించే కారిడార్లను కాపాడుకోకపోతే ఈ సాధించిన విజయాలన్నీ ప్రమాదంలో పడే ముప్పుంది.

అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో పులి చర్మం, ఎముకలు, దంతాలు, గోళ్లు, ఖడ్గమృగ కొమ్ములు, చిరుత చర్మాలకు ఉన్న అక్రమ డిమాండ్ కారణంగా ముఠాలు వేటను ఒక వ్యాపారంగా మారుస్తున్నాయి. దీనిని అరికట్టేందుకు అటవీ శాఖతో పాటు నిఘా విభాగాలు, సరిహద్దు రక్షణ దళాలు, న్యాయ వ్యవస్థ సమన్వయంతో ఉక్కుపాదం మోపాలి. అదే సమయంలో సంరక్షణ వ్యూహాలలో అటవీ సరిహద్దుల్లో శతాబ్దాలుగా సహజీవనం సాగిస్తున్న స్థానిక ఆదివాసీలు, చెంచు, గోండు, కోయ వంటి గిరిజన తెగల సహజ భాగస్వామ్యం అత్యంత ప్రాధాన్యమైనది. అడవిపై ఆధారపడిన ఆదివాసీల సాంప్రదాయ విజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, వారి జీవనోపాధిని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణలో వారిని అటవీ రక్షకులుగా మార్చాలి. వన్యజీవుల వల్ల పంటలకు, పశువులకు నష్టం వాటిల్లినప్పుడు అధికార యంత్రాంగం ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ పరిహారం అందించడం, సోలార్ కంచెలు, ముందస్తు హెచ్చరిక సైరన్ల వంటి అధునాతన సాంకేతికతలను విస్తృతం చేయడం ద్వారా మనుషుల్లో జంతువులపై రగిలే ప్రతీకార ధోరణిని సమర్థవంతంగా నివారించవచ్చు.

సంరక్షణ అనేది ఏదో అటవీ శాఖ అధికారుల లాఠీలకో, తుపాకులకో మాత్రమే పరిమితమైన కార్యం కాదు. పర్యావరణ యాత్రికులుగా అడవులకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు పారవేయకుండా ఉండటం, రాత్రివేళల్లో శబ్ద కాలుష్యం చేయకపోవడం, జంతువులను వెంబడించి సెల్ఫీలు తీసుకోకపోవడం వంటి పౌర నియమావళిని నిక్కచ్చిగా పాటించాలి. బాల్యం నుంచే పాఠశాలలు, కళాశాలల్లో ప్రకృతి విద్యా బోధన జరగాలి. పులి గంభీరతను వర్ణించడమే కాక, అది నదీ జలాల పరిరక్షణకు ఎలా దోహదపడుతుందో బోధించాలి. భయంతో పామును చూడగానే చంపడం కాక, ఎలుకల బెడదను నివారించి ఆహార ధాన్యాలను కాపాడే రైతు నేస్తమని వివరించాలి. గుడ్లగూబ, గబ్బిలాలు, రాబందులు వంటి జీవులు పర్యావరణాన్ని శుద్ధి చేసే సహజ స్కావెంజర్లుగా ఎంతటి అనన్య సేవ చేస్తున్నాయో సమాజం గ్రహించాలి. అభివృద్ధి ముసుగులో ప్రకృతిని సంపూర్ణంగా బలిపెట్టే ధోరణి వినాశనానికి హేతువవుతుంది. రోడ్లు, ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు 'ఎకో-బ్రిడ్జిలు', 'అండర్‌పాస్‌లు' వంటి పర్యావరణహిత మౌలిక వసతులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

"సహనౌ భునక్తు... సర్వే సంతు నిరామయాః" అన్న భారతీయ ఆర్షవాణి కేవలం మానవ సమాజానికే పరిమితం కాదు; ఈ విశాల విశ్వంలో సమస్త జీవకోటి శాంతిగా, పరస్పర సమన్వయంతో వర్ధిల్లాలన్నదే సనాతన ధర్మసారం. 'జీవో జీవస్య జీవనం' అనే ప్రకృతి శాసనాన్ని అర్థం చేసుకున్నప్పుడే మానవ ప్రగతికి నిజమైన అర్థం దక్కుతుంది. అడవి లోతుల్లో శార్దూల గర్జన నిర్భయంగా మార్మోగినా, పచ్చిక బయళ్లలో లేడి పిల్లలు గెంతులు వేసినా, గగన తలంలో పక్షుల కిలకిలారావాలు మిన్నంటినా.. అది ఆ అడవి జీవకళకు, భూగోళం ఆరోగ్యానికి అసలైన సూచిక. ఒకవేళ అడవి నిశ్శబ్దమైతే, మూగజీవులు అంతరిస్తే.. అది రాబోయే పెను విపత్తుకు, మానవాళి అంతానికి వినబడని మృత్యుఘంటిక అని గుర్తించాలి. ప్రకృతి సమతుల్యతను కాపాడటం అంటే రేపటి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, పవిత్రమైన నీటిని, నివాసయోగ్యమైన భూమిని వారసత్వంగా అందించడమే. కాబట్టి వన్యప్రాణుల రక్షణ అనేది చట్టాలు చేసే నిర్బంధ విధిగా కాక, హృదయపూర్వకమైన ప్రజా ఉద్యమంగా, ప్రతి పౌరుడి అంతఃచేతనగా మారినప్పుడే మానవజాతి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఈనెల 7లోగా జీఓ97ను ఉపసంహరించుకోవాలి-తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 3: పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు కోసే జిఓ97 ను ప్రభుత్వం ఈ నెల 7వ తేదీ లోగా ఉపసంహరించుకోవాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరా పార్కు వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులు జిఓ 97 కు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాకు హాజరై విద్యార్థుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష మందికి పైగా పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసే జిఓ 97 ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని 20 రోజుల నుండి విద్యార్థులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. వెంటనే జిఓను రద్దు చేయకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన ఆస్తుల కోసమే ముఖ్యమంత్రి జిఓ 97 ను తీసుకొచ్చారని విమర్శించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చింది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కాలేజీలను ప్రయివేట్ పరం చేయాలనే దుర్మార్గపు ఆలోచనతోనే స్కిల్ యూనివర్సిటీకి బదలాయించాలని చర్యలు చేపట్టిందని మండిపడ్డారు.

ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం తో నడిచే యూనివర్సిటీ కి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండే రెండేళ్లు మాత్రమే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుకు బి ఆర్ ఎస్ పార్టీ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ప్రకటించారు. లేబర్ డిపార్ట్మెంట్ పరిధిలోని ఎిఎ లను మూసివేసి, పాలిటెక్నిక్ కాలేజీలను లేబర్ డిపార్ట్మెంట్ పరిధిలోకి తీసుకొస్తామని ప్రకటించడం ఎంతవరకు సబబు అని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. జిఓ 97 పై విచారణకు కమిటీ వేశామని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

అసలు జిఓ 97 తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రయివేట్ వ్యక్తులకు పాలిటెక్నిక్ ఆస్తులను కట్టబెట్టేందుకు, తాకట్టు పెట్టేందుకు కుట్రలు చేస్తుందని స్పష్టం చేశారు. సీనియర్ ఎఐా ఆకునూరి మురళి వంటి వంటి వ్యక్తులు కూడా ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను సమర్ధించడం బాధాకరం అన్నారు. ప్రజా పాలన అని చెప్పుకుంటూ ఈ ప్రభుత్వం దోపిడీ దొంగల లాగా దోపిడీకి పాల్పడుతుందని మండిపడ్డారు. జెన్ జీ చేసిన పోరాటానికి ప్రధానమంత్రి దిగొచ్చి కేంద్రమంత్రి చేత రాజీనామా చేయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలని, అధైర్య పడొద్దని మీకు మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# నేడు రామగుండంలో మాంసం దుకాణాలు బంద్

కరీంనగర్, సెప్టెంబర్ 3: డీఎంఏ ఆదేశాల మేరకు రామగుండం నగర పాలక సంస్థ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పవిత్ర పర్వదినం శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీ, రామగుండం, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల్లో మాంసం దుకాణాలు మూసివేసి ఉంచాలని నగర పాలక కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ ఆదేశించింది. ఈ మేరకు గురువారం ప్రకటన జారీ చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా వ్యాపారులు జీవ హింసకు పాల్పడి గుట్టుగా మాంసం విక్రయించినట్లయితే సదరు వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు.

# లినక్స్ ఆధారిత 'జియోసరళ్' సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించిన ఎస్రి ఇండియా

హైదరాబాద్, సెప్టెంబర్ 3: భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) సాఫ్ట్‌వేర్, లొకేషన్ ఇంటెలిజెన్స్, మ్యాపింగ్ పరిష్కారాల రంగంలో అగ్రగామిగా ఉన్న ఎస్రి ఇండియా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'జియోసరళ్' అనే లినక్స్ ఆధారిత డెస్క్‌టాప్ జీఐఎస్ సాఫ్ట్‌వేర్‌ను గురువారం ఆవిష్కరించింది. భారతదేశంలో జియోస్పేషియల్ సాంకేతికత వినియోగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది.

సంస్థలు, ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ప్రొఫెషనల్ జీఐఎస్ వినియోగదారులు అధునాతన విశ్లేషణలు, 3డీ మ్యాపింగ్, నెట్‌వర్క్ విశ్లేషణ వంటి పనుల కోసం ArcGIS Proను వినియోగిస్తున్నప్పటికీ, మ్యాపింగ్, విజువలైజేషన్, డేటా క్వెరీలు, ఎడిటింగ్ వంటి సాధారణ అవసరాల కోసం తేలికపాటి డెస్క్‌టాప్ జీఐఎస్ సాఫ్ట్‌వేర్ అవసరం ఉందని సంస్థ పేర్కొంది. ఆ అవసరాన్ని తీర్చేందుకు జియోసరళ్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది.

ప్రస్తుతం ఈ సాఫ్ట్‌వేర్ లినక్స్‌తో పాటు విండోస్‌లోనూ అందుబాటులో ఉందని, త్వరలో ఆండ్రాయిడ్‌కు కూడా మద్దతు ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

ఈ సందర్భంగా ఎస్రి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అగేంద్ర కుమార్ మాట్లాడుతూ... వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఆవిష్కరణలు చేయడం తమ సంస్థ లక్ష్యమన్నారు. జియోసరళ్ ఆవిష్కరణ తమ సాంకేతిక ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. తక్కువ వ్యయంతో లభించే లినక్స్ ఆధారిత జీఐఎస్ సాఫ్ట్‌వేర్ కోసం ఎదురుచూస్తున్న వినియోగదారులకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ArcGIS వాతావరణంలో మ్యాపింగ్, విజువలైజేషన్, ఎడిటింగ్, క్వెరీల వంటి సాధారణ పనులను సమర్థంగా నిర్వహించగలదని తెలిపారు. అధునాతన అవసరాల కోసం ArcGIS Proను యథావిధిగా ఉపయోగించుకోవచ్చని వివరించారు.

జియోసరళ్ ప్రస్తుతం వినియోగదారులు ఉపయోగిస్తున్న ArcGIS వ్యవస్థలతో సమన్వయంగా పనిచేస్తుందని సంస్థ తెలిపింది. అలాగే ×ndo ArcGIS Living Atlas లోని డేటాను వినియోగించుకోవడంతో పాటు, ఇంటర్నెట్ అందుబాటులో లేకపోయినా స్థానికంగా భద్రపరిచిన జీఐఎస్ డేటా, బేస్ మ్యాప్‌లను వీక్షించడం, నిర్వహించడం, విశ్లేషించడం వీలవుతుందని పేర్కొంది. ఎంటర్‌ప్రైజ్ స్థాయి భద్రతా ప్రమాణాలతో దీనిని రూపొందించినట్లు వెల్లడించింది.

పాలన, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, రక్షణ, యుటిలిటీలు, పట్టణాభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణ తదితర రంగాల్లో జియోస్పేషియల్ సాంకేతికత వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, స్వదేశీ పరిష్కారాల అభివృద్ధి దేశ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఎస్రి ఇండియా పేర్కొంది. జియోసరళ్ ఆ దిశగా మరో ముందడుగని వెల్లడించింది.

# కంగ్టిలో మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఘనంగా భూమి పూజ.

### మైనారిటీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది: ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.



సంగారెడ్డి సెప్టెంబర్ 3(నేటి నిజం ప్రతినిధి)మైనారిటీ వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రమైన కంగ్టిలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) నిధులతో మంజూరైన అత్యాధునిక మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఘనంగా భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి మైనారిటీ కుటుంబాలు తమ శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలను తక్కువ ఖర్చుతో గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు వీలుగా మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవనం అందుబాటులోకి వచ్చిన అనంతరం మైనారిటీ కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి నాయకులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అసెంబ్లీలో మీ సమస్యే మా తొలి ప్రాధాన్యత.. పాలిటెక్నిక్ విద్యార్థులతో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 3:జీవో 97 కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై నల్గొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను చెప్పగా.. కేటీఆర్ మీకు మేమున్నామంటూ భరోసానిచ్చారు.

కటీఆర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ మొదలవుతుంది.. మీ సమస్యనే మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటాం. ప్రభుత్వం ముందుకొచ్చి మీ సమస్యపై స్పష్టత ఇచ్చే దాకా వదిలిపెట్టం. వాళ్లు మీ పాలిటెక్నిక్ కాలేజీల భూములు ఎక్కడెక్కడైతే ఉన్నయో ఆ భూముల మీద కన్నేశారు. ఆ భూములు అమ్ముకోవడానికే ఈ డ్రామా. రేవంత్ రెడ్డికి తెలిసిందల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారమే కాబట్టి ఆయనకు వేరే ఎజెండా ఏం లేదు.. మీ పాలిటెక్నిక్ కాలేజీల కిందున్న భూములు ఎత్తుకొని పోవాలి.

అందులో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉండే భూములు ఎత్తుకొని పోవాలి.. దానికి లింక్ పెట్టి మిమ్మల్ని అందరినీ ఆగం చేస్తా ఉన్నడు. మాకు తిండి లేదు ఏం లేదు సార్ అని విద్యార్థులు అంటుంటే.. మాకొదిలి పెట్టండి.. వాళ్ల ప్రపోజల్ ముందుకు పోకుండా చూసుకునే బాధ్యత మాదని కేటీఆర్ హామీనిచ్చారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.